www.samasamajam.in

# సమ సమాజం

ప్రశ్నించే అక్షరం... ప్రజలకోసం... తెలుగు దిన పత్రిక

తెలంగాణ | మంగళ వారం, 6 సెప్టెంబర్ 2022 | ఎడిటర్ : గోసుకొండ పృధ్విరాజు | సంపుటి - 07, సంచిక-141 | పేజీలు - 4 వెల రూ. 5/-

Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Karimnagar, Warangal, Mahaboobnagar, Kammam, Medak

# ఇక దేశవ్యాప్తంగా రైతులకు ఉచిత కరెంట్





**నిజామాబాద్, సెప్టెంబర్ 5 (సమ సమాజం):** దేశంలో అధికారంలో ఉన్న నిరంకుశ మోడీ ప్రభుత్వాన్ని గద్దె దింపడం ద్వారా దేశంలో కొత్త రాజకీయాలను ప్రారంభించబోతున్నామని సిఎం కెసిఆర్ ప్రకటించారు. ఇందుకు ప్రజలు పూర్తి మద్దతు ప్రకటించాలన్నారు. 2024లో ఢిల్లీ గద్దెపై తమ ప్రభుత్వమే కొలువు దీరుతుందని సీఎం కేసీఆర్ ప్రకటించారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ ముక్త్ భారత్ కోసం ప్రజలు ఓటు వేయాలని కోరారు. నిజామాబాద్‌లో గిరిరాజ్ కాలేజీ గ్రౌండ్‌లో నిర్వహించిన సభలో పాల్గొన్న సీఎం కేసీఆర్.. దేశ రాజకీయాలను ప్రభావితం చేసేందుకు తాను సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించారు. ఇందుకోసం ఎంతకైనా తెగించేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. అంతకుముందు నిజామాబాద్ కలెక్టరేట్ సముదా యన్ని కెసిఆర్ ప్రారంభించారు. నిజామాబాద్ జిల్లాలో టీఆర్ఎస్ పార్టీ ఆఫీసు, నూతన కలెక్టరేట్‌ను ప్రారంభించిన అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం కేసీఆర్ ప్రసంగించారు. ప్రజల కోరిక, ఆశీస్సులతో త్వరలోనే జాతీయ రాజకీయ ప్రస్థానం ప్రారంభిస్తానని కేసీఆర్ స్పష్టంచేశారు. 2024లో దేశంలోని రైతులందరికీ ఉచిత కరెంట్ ఇస్తామని హామీ ఇచ్చారు. ప్రజలంతా ఏకమై బావుల దగ్గర మీటర్లు పెట్టాలంటున్న వారికి మీటర్ పెట్టాలని కేసీఆర్ పిలుపునిచ్చారు. బీజేపీ ముక్తభారత్ నినాదంతో ముందుకు వెళ్తామని ప్రజలంతా అండగా నిలవాలని కోరారు. దేశం బాగుపడాలంటే ఆరోగ్యకరమైన రాజకీయాలు ఉండాలని.. ప్రజాస్వామ్యబద్ధంగా దేశాన్ని ముందుకు తీసుకపోయే లౌకికవాద ప్రభుత్వం అవసరమన్నారు. మోడీ ప్రభుత్వం అహంకారంతో ప్రతిపక్షాలను చీల్చి ప్రభుత్వాలను పడగొడుతుందని మండిపడ్డారు. మోడీ విధానాలతో అంతర్జాతీయంగా దేశం పరువుపోయే పరిస్థితి ఏర్పడిందని కేసీఆర్ అన్నారు. అన్ని రంగాల్లో విఫలమైన కేంద్రం మతపిచ్చితో మంటలు పెడుతోందని మండిపడ్డారు. రాష్ట్రంలో గోదావరి నీళ్లు పారాల..లేక మతపిచ్చితో నెత్తురు పారాల అనేది ప్రజలు ఆలోచించుకోవాలన్నారు. దేశంలో రైతులు వాడే కరెంట్ 20.8 శాతమే అని..దానికి లక్షా 45వేల కోట్లు మాత్రమే ఖర్చు అవుతుందన్నారు. రైతుల కోసం లక్షా 45 వేల

3వ

- దేశంలో రాబోయేది మన ప్రభుత్వమే
- 2024 ఎన్నికలు దేశానికి అత్యం కీలకం
- బిజెపిని సాగనంపి మన ప్రభుత్వాన్ని ఎన్నుకుందాం
- బిజెపి ముక్త భారత్‌కు ప్రజలంతా మద్దతు పలకాలి
- ప్రజల ఆశిస్సులతో జాతీయ రాజకీయాల్లోకి వెళతా
- నిజామాబాద్ సభలో సిఎం కెసిఆర్ ప్రకటన
- సమీకృత కలెక్టరేట్ భవానానికి ప్రారంభోత్సవం

## సమాజాన్ని నిర్మించే శక్తు ఉపాధ్యాయులదే





- వారి సమాజ నిర్మాణానికి పునాదులు
- కరోనా సమయంలో వారి సేవలు అమోఘం
- విద్యారంగ అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వ కృషి
- కేంద్రం ఎక్కడా సహకరించడం లేదు
- రవీంద్రభారతిలో ఉపాధ్యాయ దినోత్సవంలో సబితా ఇంద్రారెడ్డి
- పలువురు ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

2వ

## ఉపాధ్యాయ వృత్తికి గౌరవం తెచ్చిన సర్వేపల్లి

గురుపూజోత్సవంలో నివాళి అర్పించిన మంత్రి



**సూర్యాపేట, సెప్టెంబర్ 5 (సమ సమాజం):** స్వాతంత్ర్య ఉద్యమంలో ఉపాధ్యాయులపాత్ర గణనీయమైనదని మంత్రి జగదీష్ రెడ్డి అన్నారు. దేశ రెండో రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్.. రాష్ట్రపతిగా కాకుండా ఉపాధ్యాయ వృత్తికే ప్రాధాన్యమిచ్చిన అంశాన్ని గుర్తుచేశారు. గురుపూజోత్సవాన్ని పురస్కరించుకుని సూర్యాపేట పట్టణంలో ఏర్పాటు చేసిన ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో మంత్రి జగదీష్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా

2వ

## మోడీ హయాంలో వందలక్షల కోట్లకు భారత్ అప్ప

గతంలో ఎప్పుడూ ఇంతగా పరిస్థితి దిగజారలేదు

కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ వ్యాఖ్యలపై కెటిఆర్ ట్వీట్



**హైదరాబాద్, సెప్టెంబర్ 5 (సమ సమాజం):** మోడీ ప్రధానిగా బాధ్యతలు తీసుకున్న తర్వాత గత ఎనిమిదేళ్లలో రూ.100లక్షల కోట్లకు దేశ అప్పు పెరిగిందని మంత్రి కేటీఆర్ విమర్శించారు. తెలంగాణ రాష్ట్ర అప్పులపై కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ చేసిన వ్యాఖ్యలపై కేటీఆర్ ట్విటర్‌లో ఘాటుగా స్పందించారు. 2014 ముందు వరకు 67ఏళ్ల స్వతంత్ర భారతదేశంలో 14 మంది ప్రధానులు మారినా.. దేశ అప్పు రూ.56లక్షల కోట్లు ఉండేదన్నారు. ఫలితంగా ప్రతి భారతీయుడిపై రూ.1.25 లక్షల అప్పు ఉందని పేర్కొన్నారు. ఆర్థిక విషయాలపై అనర్గళంగా మాట్లాడుతున్న నిర్మలా సీతారామన్ ఆయా అంశాలను సైతం ప్రస్తావించాలన్నారు. 2022లో తెలంగాణ తలసరి ఆదాయం రూ.2.78లక్షలు కాగా... జాతీయ తలసరి ఆదాయం కేవలం రూ.1.49 లక్షలు అని ట్విటర్‌లో పేర్కొన్నారు. ఇక తెలంగాణ జీఎస్‌డీపీ కేవలం 23.5శాతమని వివరించారు. కేవలం 2.5శాతం జనాభా కలిగిన తెలంగాణ.. జీడీపీలో ఐదు శాతం వాటా కలిగి ఉందన్నారు. బిజెపి పాలిత ప్రాంతాలు తెలంగాణ ప్రభుత్వం అంత మెరుగ్గా పనిచేస్తే భారత్ 4.6 ట్రిలియన్ డాలర్ల ఎకానమికి ఎదిగేదని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

## హైదరాబాద్‌లో ప్రపంచస్థాయి సైక్లింగ్ ట్రాక్

నేడు శంకుస్థాపన చేయనున్న కెటిఆర్



**హైదరాబాద్, సెప్టెంబర్ 5 (సమ సమాజం):** ఇప్పటికే ప్రపంచస్థాయి గుర్తింపు పొందిన హైదరాబాద్ సిగలో మరో మణిహారం చేరబోతున్నది. వచ్చే ఏడాదినాటికి ప్రపంచస్థాయి సైక్లింగ్ ట్రాక్ అందుబాటులోకి రానుంది. ఓఆర్ఆర్ పరిధిలో సోలార్ రూఫ్‌తో కూడిన 21 కి.మీ సైక్లింగ్ ట్రాక్‌కు మంత్రి కేటీఆర్ మంగళవారం శంకుస్థాపన చేయనున్నారు. ఓఆర్ఆర్ వెంట నానక్‌రామ్‌గూడ-టీఎస్‌పీఏ, నార్సింగి-కొల్లూరు స్ట్రెచ్‌లో 4.5 మీటర్ల వెడల్పులో 3 లేన్ బై-సైకిల్ ట్రాక్‌కు సెప్టెంబర్ 6న మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేస్తారని ఎంఏ అండ్ యూడీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అర్వింద్‌కుమార్ తెలిపారు. ఇది సీసీటీవీలతోసహా అన్ని భద్రతా ఫీచర్లతో 24/7 పని చేస్తుందని ఆయన వెల్లడించారు. ఇందుకు సంబంధించిన నమూనా ఫొటోలను ట్విటర్‌లో షేర్ చేశారు.

## హిందూ జాతిని ఏకీకృతం చేసిన తిలక్



- గణెశ్ ఉత్సవాలతో స్వాతంత్ర్యపోరాటంలో కర్తవ్యోన్ముఖం
- వినాయక నిమజ్జనంలో నిర్లక్ష్యంగా ప్రభుత్వం తీరు
- ఖైరతాబాద్ వినాయకుడిని దర్శించుకున్న బండి తదితరులు

2వ

## గురుకుల విద్య అభివృద్ధికి కోట్లాది రూపాయలు వెచ్చింపు

స్వచ్ఛ గురుకులం' కార్యక్రమ ప్రారంభోత్సవంలో మంత్రి సత్యవతి



**మహబూబాబాద్,సెప్టెంబర్ 5 (సమ సమాజం):** రాష్ట్రంలో గత ఏడేండ్లలో గురుకుల విద్య అభివృద్ధికి కోట్లాది రూపాయలు రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేసి విద్యాభివృద్ధికి పాటుపడుతుందని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 'స్వచ్ఛ గురుకులం' కార్యక్రమాన్ని గిరిజన సంక్షేమ గురుకుల బాలుర రెసిడెన్షియల్ పాఠశాల, సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలల్లో జిల్లా కలెక్టర్ కె. శశాంకతో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో గురుకులాల సంఖ్యను 183 కు పెంచుకున్నామని, 22 డిగ్రీ కాలేజీలు 332 ఆశ్రమ పాఠశాలలు నిర్వహిస్తున్నామని ఆమె తెలిపారు. ఈ నెల 5 నుంచి 11 వ తేదీ వరకు

3వ

## గణెశ్ నిమజ్జనంపై తప్పడు ప్రచారం

9ననే నిమజ్జనం అని ఉత్సవ సమితి వెల్లడి

తగిన ఏర్‌ఆపట్‌ఉల చేయాలని ప్రభుత్వానికి డిమాండ్

**హైదరాబాద్,సెప్టెంబర్ 5 (సమ సమాజం):** గణెష్ నిమజ్జనంపై కొందరు కావాలనే తప్పుడు ప్రచారం చేస్తున్నారని భాగ్యనగర గణెళిష్ ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి భగవంతరావ్ మండిపడ్డారు. సంప్రదాయం ప్రకారం అనంత చతుర్దశి ఈ నెల 9న శుక్రవారం వినాయకుడి నిమజ్జనం జరుగుతందని చెప్పారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సూచించారు. విగ్రహాలను వినాయక సాగర్ కు తీసుకెళ్లనీయకుండా అక్కడక్కడ భక్తులను అడ్డుకుని పోలీసులు కౌన్సిలింగ్ పేరుతో వేధించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులను అడ్డుపెట్టుకుని గణెళిష్ ఉత్సవాలను నీరుగార్చడానికి ప్రభుత్వం కక్ష కట్టినట్టు వ్యవహరిస్తుందన్నారు. నిమజ్జన కార్యక్రమానికి ప్రభుత్వం సహకరించాలని భగవంతరావు కోరారు. హిందూ ఉత్సవాలను అడ్డుకోవడానికి కేసీఆర్ కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు. సీఎం కేసీఆర్‌కు బతుకమ్మ, బోనాలు, రంజాన్,మొహర్రం, క్రిస్మస్ పండుగల మీద ఉన్న ఉత్సాహం, గణెళిష్ ఉత్సవాల మీద లేదన్నారు. వినాయకుడితో పెట్టుకుంటే కేసీఆర్ ఆగమైపోతారన్నారు. ఎలాంటి అడ్డంకులు లేకుండా ప్రభుత్వం నిమజ్జనం కార్యక్రమం ప్రశాతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. గణెళిష్ నిమజ్జనం కోసం తాత్కాలిక చెరువులు కడతామన్నారని..ఇప్పటి వరకు నగరంలో

2వ

## మునుగోడు దెబ్బతో ఫామ్‌హౌజ్ వీడిన కెసిఆర్

తెలంగాణ ప్రజల ఆత్మ గౌరవ పోరాటంగా ఉప ఎన్నిక

మాజీ ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి



**యాదాద్రి, సెప్టెంబర్ 5 (సమ సమాజం):** తెలంగాణ ప్రజల ఆత్మగౌరవం కోసమే మునుగోడు ఉపఎన్నిక జరగబోతోందని మాజీ ఎమ్మెల్యే,బిజెపి నేత కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. సోమవారం చౌటుప్పల్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎనిమిదేళ్లు ఫామ్ హౌస్ నుంచి రాని సీఎం కేసీఆర్ మునుగోడు ఉప ఎన్నిక దెబ్బతో అన్ని నియోజకవర్గాలు తిరుగుతున్నారని అన్నారు. మూడో విడత గొర్రెల పంపిణీ మునుగోడులో మాత్రమే పంపిణీ చేస్తున్నారని విమర్శించారు. మునుగోడులో గ్రామానికి ఇద్దరు ఎమ్మెల్యేలు, మంత్రి జగదీష్ రెడ్డి తిరిగినా మునుగోడు ప్రజలను ఒప్పించడం వారి తరం

3వ

## సంపాదకీయం

# ఏకీకృత విద్యకు కృషి జరగాలి !

మరోరెండు రోజుల్లో అంటే సెప్టెంబర్ 8న ప్రపంచ అక్షరాస్యతా దినోత్సవం జరుపుకుంటాం. అలాగే సెప్టెంబర్ 5న ఘనంగా గురుపూజోత్సవం జరుపుకుంటున్నాం. ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించు కుంటున్నాం. ఏటా ఈ రెండు పండగలను ఘనంగా నిర్వహించుకుంటున్నా విద్య విషయంలో మాత్రం ఏకాభిప్రాయసాధనకు రావడం లేదు. అలాగే విద్యారంగాన్ని పటిష్టం చేయాలన్న ఆలోచన గానీ, జాతీయ విద్యావిధానం తీసుకునిరావాలన్న సంకల్పం కానీ కానరావడం లేదు. దేశాన్ని కట్టి ఉంచడానికి, సమాజా న్ని, ప్రజలను ఒకే గొడుకు కిందకు తీసుకుని రావడానికి, ప్రాంతీయ అసమానతలను తొలగించడానికి కేవలం విద్య మాత్రమే దోహదం చేస్తుంది. అలాగే విద్యారంగానికి నిధులు కేటాయింపులు పెంచి ఏకీకృత విద్యావిధానం తీసుకుని రావాలి. ఉపాధ్యాయులను నియించి వారిని గౌరవించుకోవడమే గాకుండా పాఠశాల నుంచి ఉన్నత విద్య వరకు విద్యారంగాన్ని బలోపేతం చేసుకోవాలి. నిజానికి అక్షరాస్యతలో దేశం ఇంకా వెనకబడి ఉంది. వెనకబడిన ప్రాంతాలు, గిరిజనప్రాంతాలకు విద్య అందడం లేదు. ఉపాధ్యాయులను ఏటా సత్కరించుకుంటున్నా..పాఠశాలలను బలోపేతం చేయడంలో కానీ, ఉపాధ్యాయనియామకాల్లో గానీ శ్రద్ధ తీసుకోవడం లేదు. ఉన్న స్కూళ్లను మూసేయడం, క్రమబద్ధీకరిం చడం చేస్తున్నారు. మారుమూల ప్రాంతా పిల్లలకు సైతం విద్యను నేర్పాలన్న లక్ష్యంతో ఏర్పాటుచేసిన స్కూళ్లను క్రమబద్ధీకరణ పేరుతో మూసేయడం పాలకుల దాష్టీకానికి నిదర్శనం గా చూడాలి. ప్రైవేట్ రంగంలో విద్యను ప్రోత్సహించి విద్యావ్యాపారానికి పాలకులులే తోడ్పడడం దారుణం. ఒకేదేశం, ఒకే పన్ను, ఒకే చట్టం అంటున్న మోడీ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం కూడా జాతీయ విద్యా విధానం అంటూ ప్రకటనలు గుప్పిస్తున్నా అది కూడా సాకారం కావడం లేదు. ఎక్కడవేసిన గొంగలి అక్కడే అన్న చందంగా ప్రైవేట్ విద్యారంగం బలపడుతోందే తప్ప ప్రభుత్వ విద్యావిధానం పట్టాలకెక్కడం లేదు. దీనికితోడు స్కూళ్లలో ఉపాధ్యాయుల కొరతతో పాటు, సమస్యలు తిష్టవేసుకున్నాయి. వీటిని పరిశీలించి పరిష్కరించాల్సిన పాలకులు విద్యారంగాన్ని చిన్నచూపు చూస్తున్నారు. విద్యారంగంలో మనం ముందుకు పోతున్నామని నాయకులు చెప్పింది నమ్మడానికి లేదు. స్కూళ్లు ప్రారంభమైనా ఉపాధ్యాయులు లేక నేటికీ తెరవని పాఠశాలలు కోకొల్లలు. గిరిజన ప్రాంతంలో ఉపాధ్యాయులు లేక అనేక స్కూళ్లు మూతపడి వున్నాయి. గిరిజన గ్రామాలకు నేటికీ రవాణా సౌకర్యం లేదు. వారికి కరెంట్ అంటే ఏమిటో తెలియదు. విద్యవైద్యం వారి దరికి చేరడం లేదు. కొన్నిచోట్ల ఉన్నత పాఠశాలలో ఇంగ్లీషు, లెక్కలు, భౌతిక శాస్త్రం, సామాన్య శాస్త్రాలకు స్జబెక్టు టీచర్లు లేరు. రాష్ట్రంలోని కొన్ని వేల స్కూళ్లు 5 తరగతులకు కలిపి ఒకే ఒక్క ఉపాధ్యాయుడితో నడుస్తున్నాయి. నేటికీ అనేక పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు అందడం లేదు. విద్యలో తెలుగు రాష్ట్రాలు వెనకబడి పోవడానికి సరైన దృక్పథం, చిత్తశుద్ధి లేకపోవడంగా చూడాలి. ప్రభుత్వాల బాధ్యతా రాహిత్యం కారణంగా విద్యారంగం కుదేలవుతోంది. దేశవ్యాప్తంగా ఇదే దుస్థితి నెలకొంది. ఇకపోతే ఎపిలో ఇంగ్లీష మాధ్యమంతో ముందుకు పోదామని ప్రభుత్వం భావిస్తున్నా, మరింత వెనకబడి పోవడం ఖాయం. తెలుగుమీడియం ఎందుకు వద్దని అడిగితే పేదలకు ఇంగ్లీషు వద్దా? అని ఎదురు ప్రశ్న వేస్తున్నా రు. నాయకుల పిల్లలు ఇంగ్లీషులో చదువుకుంటుంటే పేదల పిల్లలు చదువు కోకూడదా? అని మరో ప్రశ్న. డబ్బున్న వాళ్ళు లక్షల రూపాయలు పోసి ఇంగ్లీషులో చదువుకోగా, పేదలకు ప్రభుత్వం ఉచితంగా ఇంగ్లీషు చదువు చెప్పడం తప్పా? మరో ప్రశ్న. నిజానికి ప్రభుత్వ విద్యా బలోపేతంగా ఉంటే.. అదీ జాతీయ విధానంగా ఉంటే ఇలాంటి ప్రశ్నలు,మీమాంసలు రావు. దేశమంతా ఒకే విద్యావిధానం రావాలి. ఇకపోతే ప్రాంతీయ భాషల్లో బోధన జరగాల్సిందే. అలాగే దేశానికి ప్రపంచానికి అసవరమైన హిందీ, ఇంగ్లీషల్లో రాటుదేలేలా చేయాలి. ఇంగ్లీషు మాధ్యమం పెట్టడాన్ని ఎవరూ వ్యతిరేకించడం లేదు. తెలుగు మాధ్యమాన్ని రద్దు చేయొద్దనే అడుగుతున్నారు. నిజానికి మాతృభాష లోనే పిల్లలు వేగంగా అర్థం చేసుకుని విషయ పరిజ్ఞానం పెంపొందించుకోగలరని పరిశోధనలు రుజువు చేశాయి. మాధ్యమం గొడవ పక్కన పెట్టి పిల్లలం దరికి విద్యను చేరువ చేసే కార్యక్రమం జరగాలి. ఏ ఒక్క పిల్లవాడు బడిబయట ఉండకుండా చూడాలి. ఉపాధ్యాయుల నియామకాలు చేపట్టి,వారిని గతంలోలాగా గౌరవించే సంస్కృతిని బలోపేతం చేయాలి. అప్పుడు తెలుగా, ఇంగ్లీషా అన్న తర్కం చేయవచ్చు. మాతృభాష ద్వారానే జాతి సంస్కృతి, సాంప్రదా యాలు నిలబడతాయని అందరి అభిప్రాయం. రాష్ట్ర ప్రజల అభివృద్ధికి, వికాసానికి సంబంధించిన ఒక ముఖ్యమైన నిర్ణయం తీసుకునే ముందు సంబంధిత పరిశోధనలు పరిగణలోకి తీసుకో వాలి. భాషా శాస్త్రవేత్తలు, సంఘాలు, రాజకీయ పార్టీలతో సంప్రదించాలి, చర్చించాలి. మన దేశంలో అన్ని రాష్ట్రాలు వారి భాషా మాధ్యమంలో విద్యను కొనసాగిస్తున్నాయి. విద్యలో దేశంలోనే కేరళ ముందున్నది. అది కూడా మాతృభాష లోనే ప్రాథమిక విద్యను అందిస్తున్నది. కేరళ ప్రజలే ఎక్కువగా విదేశాల్లో ఉద్యోగాలు చేస్తున్నారు. ఇంగ్లీషు నేర్చు కోవడంలో తప్పులేదు. మాతృభాషలో బోధన చేస్తూనే ఇంగ్లీష్, హిందీభాషలు నేర్పితే సరిపోతుంది. ప్రాంతీయ భాషలు ఏదైనా విద్య అన్నది ఒక్కతీరుగానే ఉండాలి. పాఠ్యాంశాలు ఒక్కటిగా ఉండాలి. బోధనా విధానం ఒక్కటిగానే ఉండాలి. అలాగే దేశ చరిత్ర, పరిణామాలు, సమగ్రంగా భవిష్యత్ తరానికి తెలియచేసేలా విద్యావిధానం ఉండాలి. వీటిని గుర్తించి ఏకీకృత విద్యావిధానం కోసం కేంద్ర,రాష్ట్రాలు కృషిచేయాలి.

**పృధ్విరాజ్ గోసుకొండ**
ఎడిటర్

# పలు ప్రాంతాల్లో ఎన్ఐఎ సోదాలు

**విద్యానగర్‌లో జ్యోతి నివాసంలో తనిఖీలు**



**హైదరాబాద్, సెప్టెంబర్ 5 (సమ సమాజం):** జాతీయ దర్యాప్తు సంస్థ ఎన్ఐఎ హైదరాబాద్‌తో పాటు హనుమకొండలోని పలు ప్రాంతాల్లో సోమవారం సోదాలు చేపట్టింది. హైదరాబాద్ విద్యానగర్‌లోని చైతన్య మహిళా సంఘం కన్వీనర్ జ్యోతి ఇంట్లో ఎన్ఐఏ అధికారులు తనిఖీలు చేపట్టారు.మావోయిస్టులతో సంబంధాలున్నాయనే ఆరోపణలతో సోదాలు నిర్వహిస్తున్నట్లుగా సమాచారం. ఇంతకు ముందు జూన్‌లో రంగారెడ్డి, మెదక్ జిల్లాలు, సికింద్రాబాద్‌లోనూ ఎన్ఐఏ సోదాలు నిర్వహించింది. హైకోర్టు న్యాయవాది చుక్కా శిల్ప, దేవేంద్ర, స్వప్నలను ఎన్ఐఏ అరెస్టు చేసింది. విద్యార్థిని రాధ మావోయిస్టుల్లోకి రావడంలో నిందితుల ప్రమేయం ఉందని ఆరోపణలున్నాయి. రాధను చైతన్య మహిళా సంఘం నేతలు కిడ్నాప్ చేశారని రాధ తల్లి గతంలో ఫిర్యాదు చేసింది. ఈ క్రమంలోనే మావోయిస్ట్ రిక్రూట్‌మెంట్ కేసులో తనిఖీలు కొనసాగుతున్నాయి. అలాగే హనుమకొండలోని చైతన్య మహిళా సంఘం నాయకురాలి ఇంట్లో సోదాలు నిర్వహిస్తున్నారు. సీఎంఎస్ నాయకురాలు అనితను ఎన్ఐఏ అధికారులు ప్రశ్నిస్తున్నారు. అనిత ఓ ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్నారు. ఏపీలోని కృష్ణా జిల్లాలో ఎన్ఐఏ అధికారుల తనిఖీలు కొనసాగుతున్నట్లు సమాచారం.

# మునుగోడులో ఎగిరేది గులాబీ జెండానే

**కాంగ్రెస్,బిజెపిలు విమర్శలను కట్టిపెట్టాలి**




**నల్లగొండ,సెప్టెంబర్ 5 (సమ సమాజం):** ఎవరు ఎన్ని కుట్రలు చేసినా రాష్ట్ర అభివృద్ధే కెసిఆర్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే గ్యాదరి కిశోర్ అన్నారు. సీఎం కేసీఆర్ దేశంలో ఎక్కడా లేనివిధంగా అభివృద్ధి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు. రైతుబంధు, రైతుబీమా వంటి పథకాలు దేశానికి ఆదర్శంగా నిలిచాయన్నారు. ఉచిత విద్యుతు, 24 గంటల విద్యుతు సరఫరా చేసి బిజెపి తెలంగాణతో పోటీలో నిలవాలన్నారు. చేస్తున్న అభివృద్ధిని తట్టుకోలేక ప్రతిపక్షాలు ముఖ్యంగా కాంగ్రెస్,బిజెపి నాయకులు, నిత్యం లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. మునుగోడులో ఎగిరేది గులాబీ జెండానే అని అన్నైఆరు. పాలనలో లోపాలు ఉంటే ఎత్తి చూపండి.. సరిదిద్దుకుంటాం కానీ, పనిగట్టుకొని ఆరోపణలు, లేనిపోని ప్రచారాలు చేస్తే ప్రజలు గమనిస్తున్నారని హెచ్చరించారు. కాంగ్రెస్ నాయకులు చెప్పిన విషయాన్ని పదేపదే చెప్పడం వెనుక ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. టీఆర్ఎస్ ప్రభుత్వానికి మరో 20 ఏండ్లు తిరుగులేదని పేర్కొన్నారు. అన్ని వర్గాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న సీఎం కేసీఆర్‌తోపాటు వారి కుటుంబంపై ప్రతిపక్షాలు వ్యక్తిగత ఆరోపణలు చేయడం తగదని, వారి వైఖరి మార్చుకోవాలని సూచించారు. ఇప్పటికైనా సీఎం కేసీఆర్ కుటుంబంపై లేనిపోని ఆరోపణలు చేయడం మానుకోవాలని హితవుపలికారు. రైతు సంక్షేమం గురించి సీఎం కేసీఆర్ నిత్యం ఆలోచిస్తున్నారని అందుకే రైతులకు పెట్టబడి అందించేందుకు ఎకరాకు ఐదువేల పెట్టుబడి పథకం రూపుదిద్దుకుందని చెప్పారు. జిల్లాలో ప్రాజెక్టులు పూర్తిచేసిన ఘనత టీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని చెప్పారు. కోటిన్నర ఎకరాలకు సాగునీరు, 24 గంటల నాణ్యమైన విద్యుత్తు, గిట్టుబాటు ధర, నాణ్యమైన విత్తనాలు ఇచ్చే విధంగా ప్రభుత్వం పనిచేస్తున్నదని చెప్పారు.

# సేంద్రియ సాగుకోసం నిరంతర తపన

**ఆధునిక రాజకీయాల్లో ఆదర్శనేతగా గుర్తింపు**

**నమ్మిన సిద్ధాంతం కోసం తలవంచని ముత్యంరెడ్డి**



**సిద్దిపేట,సెప్టెంబర్ 5 (సమ సమాజం):** సేంద్రియ వ్యవసాయం అంటే ఆయనకు ప్రాణం. మనవ్యవసాయం బాగుపడాలని కలలు కన్న ఆదర్శ రైతు ఆయన. ఇక్కడి రైతులు అప్పుల ఊబిలో కూరుకుని పోకుండా వారికి నిరంతరంగా గైడ్‌గా ఉంటూ నిఖార్సయిన రైతుగా తనువు చాలించిన మహానుభావుడు చెరుకు ముత్యం రెడ్డి. ఆయనమరణించి మూడేళ్లయినా ఆయన జ్ఞపాకాలను ఇక్కడి ప్రజలు నిత్యం నెమరేసు కుంటూనే ఉంటారు. 2019 సెప్టెంబర్ 3న ఆయన మరణించారు. తన ఊరికి సిఎంగా ఉన్న చంద్రబాబును తీసుకుని వచ్చి రైతులకు స్ఫూర్తిని నింపారు. రైతులంతా సేంద్రియ పద్దతుల్లోనే వ్యవసాయం చేసి, ఆధునిక పద్దతుల్లో లాభాలు గడించాలని పదేపదే సూచించేవారు. స్వతహాగా రైతు అయిన ముత్యంరెడ్డి ఏ పదవిలో ఉన్నా వ్యవసాయాన్ని వదిలి ఉండేవారు కాదు. ఆధునిక పద్ధతుల్లో సాగు చేస్తూ తోటి రైతులకు ఆదర్శంగా నిలిచారు. ఇందిరప్రభ ద్వారా దుబ్బాక నుంచే సామూహిక వ్యవసాయానికి శ్రీకారం చుట్టారు. చేర్వాపూర్‌ను దత్తత తీసుకుని పందిరి సాగును ప్రోత్సహించారు. రైతులు నేరుగా మార్కెట్‌కు వెళ్లి కూరగాయలు అమ్ముకోవడం కోసం రైతుబజార్‌కు, సెక్రటేరియట్‌కు బస్సు సౌకర్యం కల్పించారు. ప్రాజెక్టులు కడితే రైతులు బాగుపడతారని ఆకాంక్షించేవారు. ఆయనో రైతుగా మట్టిలో బంగారం పండించాలని ఆకాంక్షించేవారు. ఆయన రాజకీయ నేతగా ఎదిగినా ఎక్కడా తన మూలాలలను వదులుకోలేదు. లంచం అన్న మాట వింటే మండిపడేవారు. ఎవరైనా అదికారి పనిచేయకుంటేనిలదీసే లక్షణం ఆయను ఉండేది. అందుకేరాజకీయ రంగంలోనూ ఇతరులకు ఆదర్శంగా నిలిచిన, ఆధునిక రాజకయిాఆలు వంటపట్టించుకోక పోవడం వల్ల ఎదగలేక పోయారు. ప్రజలు అందుకే ఆయనను కూడా ఓడించి తమ దౌర్బల్యాన్నిచాటుకున్నారు. జీవితపర్యంతం ప్రజల మధ్యే ఉంటూ వారికి చేదోడువాదోడుగా ఉన్నా ఓటమిని మాత్రం తప్పించుకోలేక పోయారు. వారితో మమేకమవుతూ వారి బాగోగులను తెలుసుకుంటూ వారి అభివృద్ధి కోసం శ్రమించారు. మచ్చలేని నాయకుడంటూ ప్రత్యర్థి పార్టీల నేతలు కూడా కొనియాడినా ఏనాడూ స్వార్థం కోసం పనిచేయలేదు. నిగర్విగానే చివరి వరకు జీవితం సాగించిన మంచిరైతునేస్తం చెరుకుముత్యం రెడ్డి. మంత్రి పదవుల్లో కొనసాగినా సాధారణ జీవితాన్నే గడిపారు. టిడిపిలో ఉన్నంతకాలంఆయన దుబ్బాక రైతుల సంక్షేమానికి నిరంతరంగా కృషి చేశారు. వ్యయసాయ సంబంధ పథకాలు ఏవి వచ్చినా ముందు దుబ్బాకలో ఉండేవి. తొగుట సింగిల్ విండో చైర్మన్‌గా ఆయన తన రాజకీయ ప్రస్థానం మొదలుపెట్టారు. 1970 నుంచి 18ఏళ్లపాటు తొగుట సర్పంచ్‌గా పనిచేశారు. దొమ్మాటలో 1989 నుంచి ఎమ్మెల్యేగా వరుసగా మూడుసార్లు గెలిచారు. 1999లో పౌర సరఫరాల శాఖ మంత్రిగా పని చేశారు. 2004లో ఓటమి పాలయ్యారు. 2009లో మహాకూటమి పొత్తుతో ఆయనకు టికెట్ రాలేదు. అప్పటి సీఎం రాజశేఖర్‌రెడ్డి పిలిచి కాంగ్రెస్ టికెట్ ఇచ్చారు. పార్టీ అభ్యర్థిగా గెలిచి, టీటీడీ దేవస్థానం సభ్యుడిగా, రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్‌గా పదవులు పొందారు. 2014లో కాంగ్రెస్ పార్టీ రాజకీయాల కారణంగా టికెట్ దక్కలేదు. సీఎం కేసీఆర్ ఆహ్వానం మేరకు టీఆర్ఎస్‌లో చేరినా ముత్యంరెడ్డికి ఎలాంటి పదవీ దక్కలేదు.

# సమాజాన్ని నిర్మించే శక్తు ఉపాధ్యాయులదే

**హైదరాబాద్, సెప్టెంబర్ 5 (సమ సమాజం):** సమాజాన్ని నిర్మించే శక్తి ఉపాధ్యాయులకు ఉందని మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. వారి ద్వారానే ఉత్తమ సమాజం ఏర్పడుతుందని అన్నారు. కొవిడ్ సమయంలో విద్యార్థుల చదువు కోసం ఉపాధ్యాయులు ఎంతో శ్రమించారని పేర్కొన్నారు. హైదరాబాద్ రవీంద్రభారతిలో నిర్వహించిన గురుపూజోత్సవం కార్యక్రమంలో భాగంగా ఉత్తమ గురువులను మంత్రి సబితా సత్కరించారు. ఉపాధ్యాయ దినోత్సవ వేడులకు మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, శ్రీనివాస్ గౌడ్, మహమూద్ అలీ పాల్గొన్నారు. సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాజాన్ని గొప్పగా నిర్మించే శక్తి ఉపాధ్యాయులకు ఉందని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి స్పష్టం చేశారు. కరోనా సమయంలో విద్యార్థుల చదువు కోసం ఉపాధ్యాయులు ఎంతో శ్రమించారని గుర్తు చేశారు. సమాజంలో డిమాండ్ ఉన్న కోర్సులకు ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులదేనని అన్నారు. మన ఊరు మన బడి కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మంత్రి సబితా సూచించారు. మన సంప్రదాయాలను, సంస్కృతి నైతిక విలువను బోధించేది ఉపాధ్యాయులన్నారు. తల్లిదండ్రులతో కన్న ఎక్కువ సమయం విద్యార్థులు మీతోనే ఉంటారని అన్నారు. విద్యలో సమూలమైన మార్పులు తీసుకొస్తున్నాం. విద్యార్థి సర్టిఫికెట్ తీసుకొని రాష్ట్రప్రభుత్వం విద్యకు పెద్దపీట వేస్తుంది. ఇంత చేసినా కేంద్రం నుంచి ఎలాంటి గుర్తింపు లేదు. అందుకనుగుణంగా నిధులు విడుదల చేయడం లేదని సబితా ఇంద్రారెడ్డి అన్నారు. పూర్వజన్మలో ఎంతో పుణ్యం చేసుకుంటే తప్ప టీచర్లు కాలేరన్నారు. విద్యా విధానంలో నైతిక విలువలకు పెద్దపీట వేయాలన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా గురుకులాలు ఏర్పాటు చేసి ఉచిత విద్య అందిస్తున్నామని పేర్కొన్నారు. 'మన ఊరు-మన బడి' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. విద్యా వ్యవస్థను బాగు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇంత చేస్తున్నా... కేంద్రం నుంచి ఎలాంటి సహకారం అందడంలేదని ఆరోపించారు. చట్ట పరంగా రాష్ట్రానికి రావాల్సిన నిధులు కూడా కేంద్రం రాకుండా చేస్తోందని మండిపడ్డారు. ఇప్పటికైనా కేంద్రంలోని పాలకులు విద్యా వ్యవస్థ బాగుకు కృషి చేయాలని డిమాండ్ చేశారు. విద్యావ్యవస్థలో దేశమంతా తెలంగాణ వైపు చూస్తున్నదని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చేరే విద్యార్థుల సంఖ్య పెరుగుతున్నదని చెప్పారు. దేశంలో ఎక్కడాలేని విధంగా గురుకులాలు ఏర్పాటుచేసి ఉచిత విద్య అందిస్తున్నామని వెల్లడించారు. తెలంగాణపై కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపుతున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మనకు రావాల్సిన నిధులు కూడా రాకుండా కేంద్రం కుట్ర చేస్తున్నదని విమర్శించారు. ఉపాధ్యాయ దినోత్సవంలో పాల్గొనడం ఆనందంగా ఉందని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దేది ఉపాధ్యాయులేనని చెప్పారు. విద్యారంగానికి సీఎం కేసీఆర్ అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని వెల్లడించారు. విద్యాశాఖ నిధులు కూడా విడుదల కావడంలేదంటే మన రాష్ట్రంపై కేంద్రానికి ఎంత ప్రేమ ఉందో అర్థం చేసుకోవచ్చని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# తెలంగాణతో పెట్టుకుంటే కొరివితో పెట్టుకున్నట్లే

**కేంద్రమంత్రి తీరుపై మండిపడ్డ ఎంపి మాలోత్ కవిత**



**మహబూబాబాద్, సెప్టెంబర్ 5 (సమ సమాజం):** తెలంగాణతో..సీఎం కేసీఆర్‌తో పెట్టుకుంటే కొరివితో తలగోక్కున్నట్లేనని మహబూబాబాద్ ఎంపీ మాలోతు కవిత అన్నారు. మరిపెడ మున్సిపాలిటీ కేంద్రంలో ఆసరా పెన్షన్ గుర్తింపు కార్డుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ పనితీరుపై దునుమాడారు.ఇటీవల జిల్లాలో పర్యటించిన కేంద్ర మంత్రి అభివృద్ధి జరుగలేదన్న తీరుపై ఘాటుగా స్పందించారు. జిల్లాలో కోనసీమను మరిపిస్తున్న పచ్చని పంటచేలు, కంటి రెప్పవేసినంత సేపు కూడా పోని కరెంట్ సరఫరా, ఇంటింటికి శుద్ధిచేసిన తాగునీటిని అందిస్తున్న మిషన్ భగీరథ, ప్రత్యేక పంచాయతీలుగా మారిన తండాలు, ఆధునిక వైద్యం ఉచితంగా అందిస్తున్న ప్రభుత్వ దవాఖానలు చూసి మాట్లాడాలని హితవు పలికారు. బీజేపీ ప్రభుత్వం కేవలం అదాని, అంబానీలకు కొమ్ము కాస్తూ.. వారి బ్యాంకు రుణాలను మాఫీ చేస్తూ వారికి ఆసరాగా నిలుస్తుందని విమర్శించారు. కానీ, సీఎం కేసీఆర్ పేదల పక్షం వహిస్తూ అభివృద్ధి చేస్తున్నారన్నారు. ప్రజలు పెద్ద మనసుతో ఆలోచించి సీఎం కేసీఆర్‌కు అండగా నిలువాలన్నారు.

# దేశాన్ని తప్పుదోవ పట్టిస్తున్న అమిత్ షా

**కమ్యూనిస్టులు లేకుండా దేశాన్ని ఊహించలేం**

**సిపిఐ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం**



**హైదరాబాద్, సెప్టెంబర్ 5 (సమ సమాజం):** అమిత్ షా దేశ ప్రజలను తప్పుదోవపట్టిస్తున్నారని సీపీఐ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి విమర్శించారు. భారత ప్రజలు కమ్యూనిస్టులను దూరం పెట్టాలని అసత్య ప్రచారం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. వామపక్షాలు లేని భారతదేశాన్ని ఊహించలేమన్నారు. దేశంలో అభివృద్ధి బండి వెనకకుపోతుందని.. సరైన మార్గంలో నడిపించాలంటే కమ్యూనిస్టులు, మిత్ర పక్షాలు ఐక్యంగా ఉండాలని తెలిపారు. దేశంలో దోపిడి కొనసాగుతుందని.. ఈ దోపిడీ అరికట్టాలంటే కమ్యూనిస్టుల అవసరం ఎంతో ఉందన్నారు. తెలంగాణ పోరాటం విజయోత్సవ సభపై అన్ని పార్టీలతో పాటు ఎంఐఎం పార్టీ కూడా విజయోత్సవాలు నిర్వహిస్తామని తెలపడం.. సొమ్ము ఒకడిది సోకొకడిదిగా మారిందని సుధాకర్ రెడ్డి అన్నారు. కమ్యూనిస్టులు మాత్రమే సాయుధ పోరాటంలో ఘన త్యాగాలు చేశారని విజయోత్సవాలు జరుపుకునే హక్కు కమ్యూనిస్టు పార్టీలకు మాత్రమే ఉందన్నారు. బీజేపీది డబ్బుతో కూడుకున్న రాజకీయం అని.. తెలంగాణలో ఒక్క రాజకీయ పార్టీకి విమోచన దినాన్ని నిర్వహించే అర్హత లేదని సురవరం సుధాకర్ రెడ్డి అన్నారు.

# ఉపాధ్యాయ వృత్తికి గౌరవం తెచ్చిన సర్వేపల్లి

(మొదటి పేజి తరువాయి) జిల్లాలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని ఘనంగా సన్మానించారు. అనంతరం మాట్లాడుతూ.. సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషించే ఉపాధ్యాయుడి పేరుతో ఉపాధ్యాయ దినోత్సవం జరుపుకోవడం మన సంస్కృతిలో అంతర్భాగమైందన్నారు. స్వాతంత్ర్యానికి పూర్వం విద్య అందుబాటులో ఉండక పోవడం, ప్రజల మధ్య అంతరాలు సృష్టించడం వంటి పరిణామాల నేపథ్యంలో చిన్నచిన్న దేశాలు కూడా భారత్‌పై దండయాత్ర చేశాయన్నారు. విద్య లేమితోనే దేశం పరాయి పాలకుల వశమైందని పేర్కొన్నారు. అలాంటి సమయంలో ఉపాధ్యాయులు కేవలం తరగతి గదులకే పరిమితం కాకుండా స్వాతంత్ర్య సంగ్రామంలో వారు పోషించిన పాత్ర శ్లాఘనీయమైందని కొనియాడారు. నాటి నుంచి నేటి వరకు విద్యార్థుల్లో ప్రతిభను గుర్తించి వారిలో సృజనాత్మకను వెలుగులోకి తెవడంతోనే దేశం అద్భుత పురోగతి సాధిస్తున్నదని చెప్పారు.

# హిందూ జాతిని ఏకీకృతం చేసిన తిలక్

**హైదరాబాద్,సెప్టెంబర్ 5 (సమ సమాజం):** దేశం నుంచి బ్రిటిష్ వారిని తరిమికొట్టడానికే బాలగంగాధర్ తిలక్ ఆనాడు వినాయక నవరాత్రులని ఏర్పాటు చేశారని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అన్నారు. హిందూ సమజాన్ని ఏకం చేయడంతో పాటు, స్వాతంత్రోద్యమంలో వారిని కర్తవ్యోన్ముఖులను చేశారని అన్నారు. ఖైరతాబాద్ భారీ గణపతిని ఆ పార్టీ ఇంఛార్జ్ తరుణ్ చుగ్,చింతల రామచంద్రారెడ్డిలతో కలిసి ఆయన దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఏకదంతుడికి 110 అడుగుల కండువా బహుకరించారు. కులాలు, వర్గాలు, ప్రాంతాల పేరుతో విడిపోయిన హిందూ సమాజాన్ని ఏకం చేయటానికే గణనాధుడి నవరాత్రులు నిర్వహించటం జరుగుతుందని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ తెలిపారు. ఆనాడు దేశం నుంచి బ్రిటిష్ వారిని తరిమికొట్టడానికే బాలగంగాధర్ తిలక్ వినాయక నవరాత్రులని ఏర్పాటు చేశారని బండి సంజయ్ అన్నారు. ఈ వేడుకల ద్వారా హిందూ సమాజం సంఘటిత శక్తి నిరూపితమైందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఏకదంతుడికి 110అడుగుల కండువా, 25 కిలోల లడ్డూను భాజపా నేతలు బహుకరించారు. గణెళిష్ నిమజ్జనానికి సంబంధించి తెలంగాణ ప్రభుత్వం సరైన ఏర్పాట్లు చేయకపోవడంపై బండి సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రశాంత వాతావరణంలో గణెళిష్ ఉత్సవాలు జరుపుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. నిబంధనల పేరుతో ఉత్సవాలను అడ్డుకోవాలని చూస్తే ఊరుకునేది లేదన్నారు. అడ్డుకుంటే.. వినాయకుడి నిమజ్జనం ప్రగతి భవన్ లో చేస్తామన్నారు. శాంతి భద్రతల అంశం సృష్టించి రాజకీయంగా లబ్ది పొందేందుకు టీఆర్ఎస్ ప్రభుత్వం ప్రయత్నిస్తుందన్నారు. కోర్టు ఉత్తర్వులను ధిక్కరించడంలో సీఎస్ సోమేష్ కుమార్ నెంబర్ వన్ అన్నారు. నిమజ్జనంపై భాగ్యనగర్ గణెళిష్ ఉత్సవ కమిటీ తీసుకున్న నిర్ణయానికి మద్దతు ఇస్తామన్నారు. లౌడ్ స్పీకర్లపై చర్చకు సిద్ధమా అని బండి సంజయ్ సవాల్ విసిరారు. ఉపాధ్యాయుల దినోత్సవం రోజు కూడా టీచర్స్ ను గౌరవించే ఆలోచన ముఖ్యమంత్రి కేసీఆర్ కు లేదని బండి సంజయ్ అన్నారు. ఇలా చేస్తే విద్యార్థులకు ఏ సందేశం పంపుతారని బండి సంజయ్ నిలదీశారు. ఇదేనా ఉపాధ్యాయుల పట్ల సీఎంకు ఉన్న చిత్తశుద్ధి అని ప్రశ్నించారు. అరెస్ట్ చేసిన టీచర్స్ ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

# నాగర్ కర్నూలు జిల్లా తెలకపల్లిలో విషాదం

**భారీ వర్షానికి మిద్దె కూలి వృద్ధ దంపతుల మృతి**

**నాగర్‌కర్నూల్, సెప్టెంబర్ 5 (సమ సమాజం):** నాగర్ కర్నూలు జిల్లా తెలకపల్లిలో విషాదం చోటు చేసుకుంది. అర్ధరాత్రి కురిసిన భారీ వర్షానికి ఇంటి మట్టి మిద్దె కూలి నిద్రిస్తున్న ఇద్దరు దంపతులు అక్కడికక్కడే మృతి చెందారు. భార్యభర్తలు ఇద్దరు మృతి చెందడంతో ఆ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతులు భోగరాజు చంద్రయ్య(65) వెంకటమ్మ(62)గా పోలీసులు గుర్తించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. తెలకపల్లిలో నివాసముంటున్న భోగారాజు భద్రయ్య (65), భోగరాజు వెంకటమ్మ (60) వృద్ధ దంపతులు రోజు మాదిరిగానే భోజనం చేసి ముందు గదిలో పడుకున్నారు. అయితే సాయంత్రం నుంచి వర్షం కురవడంతో మట్టి మిద్దె పూర్తిగా తడిచింది. మధ్య రాత్రి 12 గంటలకు గది పూర్తిగా తెగి కుప్ప కూలి వృద్ధ దంపతులపై పడింది. దీంతో వారు అక్కడికక్కడే మృతి చెందారు. మధ్య రాత్రి కుటుంబ సభ్యులతో పాటు గ్రామస్థులతో కలిసి మట్టిని తొలగించి మృతదేహాలను బయటకు తీశారు. ఈ సంఘటనతో గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు కన్నీరుగా విలపించారు. కుమారుడు, కోడలు మరో గదిలో పడుకోవడం... మనువళ్లు ఇద్దరు వినాయక విగ్రహం దగ్గరికి వెళ్లడంతో వారు ప్రాణాలతో బయటపడ్డారు. గత నెలలో నిరంతరం కురిసిన తుపాన్ ప్రభావానికి మట్టి మిద్దెలు తడిసి ముద్దాయి. ఈ విషయంలో జిల్లా కలెక్టర్... ప్రజలకు మట్టి ఇళ్ల నుంచి సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు. తక్షణమే మట్టి ఇల్లు, పాత ఇల్లు ఖాళీ చేసి మరో ఇళ్లకు మారాలని ఆదేశాలు జారీ చేశారు.

# గణెశ నిమజ్జనంపై తప్పడు ప్రచారం

(మొదటి పేజి తరువాయి) ఎక్కడెక్కడ కట్టారో జీహెచ్ఎంసీ అధికారులు ఎలాంటి సమాచారం ఇవ్వడం లేదన్నారు. గణెళిష్ నిమజ్జనం ట్యాంక్ బండ్ లోనే చేయాలని రేపు నె÷-లకెస్ రోడ్ పై బైక్ ర్యాలీ నిర్వహిస్తామన్నారు. నిమజ్జనానికి సరైన ఏర్పాట్లు లేకుంటే..ఎక్కడి విగ్రహాలు అక్కడే పెట్టి నిరసన తెలియజేస్తామని హెచ్చరించారు.

# డెంగ్యూ నివారణకు ఆదేశాలు



**హైదరాబాద్, సెప్టెంబర్ 5 (సమ సమాజం):** డెంగ్యూ నివారణకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని మంత్రులు హరీష్ రావు, కేటీఆర్ అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో డెంగ్యూ నివారణపై వర్చువల్ విధానంలో వారు సమీక్ష నిర్వహించారు. జీహెచ్ఎంసీ సహా అన్ని మున్సిపాలిటీల్లో ఫీవర్ సర్వే నిర్వహించాలని సూచించారు. జీహెచ్ఎంసీ పరిధిలో ఇంటింటి ఫీవర్ సర్వేను వైద్యారోగ్య, జీహెచ్ఎంసీ సిబ్బంది కలిసి చేయాలని చెప్పారు. జీహెచ్ఎంసీ పరిధిలో బూస్టర్ డోస్ విరివిగా వేసేలా చర్యలు చేపట్టాలన్నారు.

# శివసేన మాజీ చీఫ్ ఉద్దవ్‌కు గుణపాఠం చెప్పాలి

### కేంద్ర హోంమంత్రి అమిత్ షా



**ముంబై, సెప్టెంబర్ 5 (సమ సమాజం):** మహారాష్ట్ర మాజీ సీఎం, శివసేన చీఫ్ ఉద్ధవ్ ఠాక్రేకు గుణపాఠం చెప్పాలని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. ముంబైలో సోమవారం జరిగిన బీజేపీ సమావేశంలో పార్టీ నేతలనుద్దేశించి ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఉద్ధవ్ ఠాక్రేపై మండిపడ్డారు. 'రాజకీయాల్లో దేనినైనా సహించవచ్చు. కానీ ద్రోహాన్ని కాదు. బీజేపీకి ద్రోహం చేసిన ఉద్ధవ్ ఠాక్రేకు గుణపాఠం చెప్పాలి' అని అమిత్ షా అన్నట్లు ఆ పార్టీ వర్గాలు వెల్లడించారు. బీజేపీకే కాకుండా సిద్ధాంతం, మహారాష్ట్ర ప్రజల తీర్పునకు ఉద్ధవ్ ఠాక్రే ద్రోహం చేశారని ఆయన విమర్శించారు. కాగా, ఉద్ధవ్ ఠాక్రేకు అధికారంపై దురాశ వల్లనే శివసేన చీలిందని అమిత్ షా ఆరోపించారు. 'ఉద్ధవ్ ఠాక్రేకు ముఖ్యమంత్రి పదవిని ఎన్నడూ మేం వాగ్దానం చేయలేదు. ఈ రోజు నేను మళ్లీ ఈ విషయం చెబుతున్నా. మేం బహిరంగంగా రాజకీయాలు చేసే వ్యక్తులం. మూసి ఉన్న గదులలో కాదు' అని ఆయన అన్నారు. రాజకీయాల్లో మోసం చేసేవారిని శిక్షించాల్సిందేనని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. త్వరలో జరుగనున్న బృహన్ ముంబై కార్పొరేషన్ ఎన్నికల్లో 150 స్థానాలు గెలువడం ద్వారా దీనిని సాధించవచ్చని అన్నారు.

# రాష్ట్ర పండగగా కాళోజి జయంతి

**హైదరాబాద్, సెప్టెంబర్ 5 (సమ సమాజం):** ప్రజా కవి కాళోజీ నారాయణరావు జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహించాలని తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 9న కాళోజీ జయంతి సందర్భంగా ప్రభుత్వ శాఖలు, విద్యాసంస్థలు, స్థానిక సంస్థలు, కార్పొరేషన్లలో ఉత్సవాలు నిర్వహించాలని ఆదేశించింది. అన్ని జిల్లాల్లోనూ కాళోజీ జయంతి జరపాలని ప్రభుత్వం కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసింది.

# కరీంనగర్‌లో పట్టపగలే చోరీ

### నగదుతో వెళుతున్న వ్యక్తి బ్యాగుచోరీ

**కరీంనగర్,సెప్టెంబర్ 5 (సమ సమాజం):** నగరంలో పట్టపగలే భారీ చోరీ జరిగింది. కలెక్టరేట్ ఎస్.బి.ఐ బ్యాంకు నుంచి 15 లక్షలు డ్రా చేసుకుని వెళ్తున్న వ్యక్తిని వెంబడించిన దుండగులు అదనుచూసి నగదు దోచుకెళ్లారు. గీతా భవన్ చౌరస్తాలో చోరీ ఘటన చోటు చేసుకుంది. రెడ్ మిక్స్ ప్లాంట్ ఓనర్ రామగిరి చంద్రప్రకాశ్ తన దగ్గర పనిచేసే కార్మికులకు వేతనాలు చెల్లించేందుకు బ్యాంకులో డబ్బులు డ్రా చేసి తీసుకెళ్తుండగా చోరీ జరిగింది. హఠాత్తుగా దుండగులొచ్చి చేతిలోని డబ్బులు తీసుకుని పారిపోతుంటే షాక్ కు గురై కేకలు వేసినా ప్రయోజనం లేకపోయిందని బాధితుడు చంద్ర ప్రకాశ్ వాపోయాడు. వెంటనే టూ టౌన్ పోలీసు స్టేషన్ కు వెళ్లి ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. చోరీ చేసిన దొంగల కోసం గాలింపు చేపట్టారు.

# గురుకుల విద్య అభివృద్ధికి కోట్లాది రూపాయలు వెచ్చింపు



(మొదటి పేజీ తరువాయి) నిర్వహించే స్వచ్ఛ గురుకులం వారోత్సవాలలో విద్యార్థులు తమ విద్యాలయాల్లో పరిసరాల పరిశుభ్రతను పాటించాలన్నారు. దీనిలో భాగంగా తమ విద్యాలయాలలో ఏడు రోజుల పాటు నిర్వహించే స్వచ్ఛ గురుకులం కార్యక్రమాన్ని పూర్తి స్థాయిలో చేపట్టాలన్నారు. గురుకులాల సమస్యల పరిష్కారానికి నిధులు మంజూరు చేస్తామని, దీనిలో భాగంగా మహబూబాబాద్ గురుకులానికి కోటి రూపాయలు మంజూరు చేస్తామని మంత్రి తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రతి మూడు నెలలకు ఒకసారి సమావేశాలు నిర్వహించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. అదేవిధంగా విద్యార్థుల ఆహార విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని, అన్ని విద్యా సంస్థలలో మిషన్ భగీరథ నీటిని సరఫరా చేయాలని మంత్రి ఆదేశించారు. కార్యక్రమంలో బానోత్ శంకర్ నాయక్, జెడ్పీ చైర్‌పర్సన్ కుమారి అంగోత్ బిందు, శిక్షణ కలెక్టర్ పరమర్ పింకేశ్వర్ కుమార్, లలిత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మునుగోడు దెబ్బతో ఫామ్‌హౌజ్ వీడిన కెసిఆర్


(మొదటి పేజీ తరువాయి) కాదన్నారు. చౌటుప్పల్ మున్సిపాలిటీ సమస్య గురించి మూడుసార్లు సీఎం అపాయింట్‌మెంట్ కోరినా ఇవ్వలేదన్నారు. రాష్ట్రంలో ఇంకా 100 స్కీములు పెట్టిన ప్రజలు కేసీఆర్‌ను నమ్మరన్నారు. మునుగోడు ప్రజల తీర్పుతోనే కేసీఆర్ పతనం ఖాయమని రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఇదిలావుంటే తనవంతుగా ఆయన ప్రజలనునేరుగా కలుస్తున్నారు. ఆదివారం సాయంత్రం బైక్‌పై తిరిగి హల్‌చల్ చేశారు. అనంతరం ఓ హోటల్ వద్ద టీతాగి, స్థానికులు, కార్యకర్తలతో ముచ్చటించారు. బైక్‌పై వెళ్లి పలు వినాయక మండపాలను దర్శించుకున్నారు. మండపాల్లో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

# ఇక దేశవ్యాప్తంగా రైతులకు ఉచిత కరెంట్

(మొదటి పేజీ తరువాయి) కోట్లు ఇవ్వలేరా అని ప్రశ్నించారు. బావుల దగ్గర మోటర్లుకు మీటర్లు పెట్టాలంటున్న మోడీకి బుద్ధి చెప్పాలని సీఎం కేసీఆర్ అన్నారు. రైతుల భూములు లాక్కోవాలన్నదే బీజేపీ ప్లాన్ అని, అన్నదాతలు వ్యవసాయం బంద్ పెడితే భూములు కొనేందుకు కార్పొరేట్ గద్దలు వాలుతాయని హెచ్చరించారు. మోడీ సర్కారు అన్నింటినీ అమ్ముకుంటూ పోతుంటే.. టీఆర్ఎస్ సర్కారు మాత్రం సంక్షేమ పథకాలతో అన్ని వర్గాలను ఆదుకుంటోం దని కేసీఆర్ అన్నారు. ఉచిత పథకాలను రద్దు చేయాలంటున్న బీజేపీ సర్కారును సాగనంపాలని పిలుపునిచ్చారు. దేశంలో 83కోట్ల ఎకరాల భూమి ఉంటే..41కోట్ల ఎకరాలు వ్యవసాయానికి అనుకూలంగా ఉందని కేసీఆర్ చెప్పారు. మోడీ అధికారంలోకి వచ్చిన నుంచి ఒక్క ప్రాజెక్ట్ గానీ ఒక ఫ్యాక్టరీ గానీ కట్టారా అని ప్రశ్నించారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్ పరం చేస్తూ దేశాన్ని మోడీ ఆగం చేస్తున్నారని ఆరోపించారు. రానున్న ఎన్నికల్లో కార్మిక, ప్రజావ్యతిరేక ప్రభుత్వం పోయి..నాన్ బీజేపీ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. గతంలో పాలకుల ఏమరపాటు వల్ల తెలంగాణను ఆంధ్రాలో కలిపారని, మన తెలంగాణ మనం తెచ్చుకోనీకే 60 ఏండ్లు పట్టిందని సీఎం కేసీఆర్ అన్నారు. వలస పాలనలో సింగూరు, నిజాం సాగర్ నీళ్లు మనకు లేకుండా పోయాయని చెప్పారు. దేశంలో అన్ని రంగాలకు 24గంటలు కరెంటు ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని స్పష్టం చేశారు. సంక్షేమ పథకాల అమలులో దేశంలో మనమే నెంబర్ వన్ అని చెప్పారు. దళిత కుటుంబాలకు రూ. 10 లక్షలు ఇచ్చే రాష్ట్రం తమదేనన్న కేసీఆర్... తండాలను గ్రామాలుగా మార్చిన ఘనత తమ ప్రభుత్వ సొంతమని చెప్పారు. నిజామాబాద్‌లో గుంట వ్యవసాయ భూమి కూడా ఖాళీగా ఉండొద్దని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. 2024 తర్వాత వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో నాన్ బీజేపీ జెండానే ఎగురుతుందని, దిక్కుమలిన, రైతుల వ్యతిరేక బీజేపీని సాగనంపుదామని పిలుపునిచ్చారు. అప్పుడు తెలంగాణ తరహాలో భారతదేశ యావత్ రైతాంగానికి ఉచిత విద్యుత్ ఇస్తామని ప్రకటిస్తున్నాను. ఈ దేశం కోసం తెలంగాణ నుంచి పోరాటం చేయాలి. ఎవరైతే బాయికాడ మీటర్ పెట్టమని అంటున్నారో.. ఎవరైతే రైతాంగాన్ని ఆత్మహత్య చేసుకోవాలని చెప్తున్నారో.. మనందరం ఏకమైన వారికే మీటర్ పెట్టాలి. అట్ల అయితనే బాగుపడుతాం అని కెసిఆర్ అన్నారు. దేశంలో బ్రహ్మాండమైన నదులు ఉన్నాయి. ఒక్కటి కూడా పెద్ద రిజర్వాయర్లు లేవు. ఒక్క ప్రాజెక్టు కట్టలేదు. కొత్త ఫ్యాక్టరీ పెట్టలేదు. అన్ని అమ్ముకునుడు తప్ప కొత్తది చేయలేదు. దయ చేసి రైతు సంఘాలు, రైతు బిడ్డలు సమావేశాలు పెట్టి రైతు వ్యతిరేక విధానం అవలంబిస్తున్న పార్టీలను తిప్పికొట్టాలని కేసీఆర్ సూచించారు. త్వరలోనే సింగూరు ప్రాజెక్టుకు కాళేశ్వరం జలాలు వస్తాయని ముఖ్యమంత్రి కేసీఆర్ స్పష్టం చేశారు. నిఇవాళ చాలా సంతోషంగా ఉంది. అద్భుతమైన పరిపాలన భవనం నిర్మించుకుని ప్రారంభించినందుకు జిల్లా అధికార యంత్రాంగాన్ని, ప్రజలను హృదయపూర్వకంగా అభినందిస్తున్నాను అని కేసీఆర్ తెలిపారు. మీ బిడ్డగా ఒకటే కోరుతున్నాను. ఎప్పటికప్పుడు మన చుట్టూ ఏం జరుగుతుందో తెలుసుకోవాలి. అప్పుడే సమాజం బాగా ముందుకు పోయే అవకాశం ఉంటుంది. పరిస్థితులను ఎప్పటికప్పుడు బేరిజు వేసుకుంటూ ముందుకు పోయే సమాజం ఉజ్వలంగా ముందుకు పోతోందన్నారు. ఒకనాడు నిజామాబాద్ జిల్లాలో ప్రపంచంలోనే అతిపెద్ద భారీ ఇరిగేషన్ ప్రాజెక్టు నిజాం సాగర్ నిర్మించుకున్నాం. కానీ వలస పాలనలో నిజాం సాగర్‌కు, సింగూరు ప్రాజెక్టుకు సాగునీరు మనకు రాలేదు. ఎన్నోసార్లు మన పొలాలు ఎండుతున్నాయని ధర్నాలు చేశాం. ఆ ధర్నాల్లో నేను కూడా పాల్గొన్నాను. కొద్ది రోజుల్లో కాళేశ్వరం కాల్వలు సింగూరు ప్రాజెక్టు వద్దకు వస్తున్నాయి. దీంతో ఒక గుంట భూమి కూడా ఖాళీ లేకుండా ఉంటది. మీ అందరి దీవెనతో భారతదేశమే ఆశ్చర్యపడే పద్దతిలో ముందుకు పోతోంది. మన పొరుగు రాష్ట్రాల్లో ఏం జరుగుతుందో మీకు తెలుసు. మన దగ్గర మహిళలు, పేదలు, విద్యార్థులకు ఎన్నో పథకాలు అమలు చేస్తున్నాం. దేశంలోనే అతి ఉత్తమమైన 24 గంటల నాణ్యమైన విద్యుత్ అందిస్తున్నాం. అనేక తరతరాల నుంచి అణిచివేయబడ్డ దళిత సోదరుల కోసం రూ. 10 లక్షలు ఇచ్చి ఆదుకుంటున్న రాష్ట్రం తెలంగాణ మాత్రమే. 60 ఏండ్లు మొత్తుకున్న గిరిజన బిడ్డాలకు పంచాయతీలను ఏర్పాటు చేయలేదు. 3600 తండాలను పంచాయతీలను ఏర్పాటు చేస్తే 3600 మంది సర్పంచ్‌లు అయ్యారు. గురుకుల పాఠశాలలు, కల్యాణలక్ష్మి, రైతుబీమా వంటి కార్యక్రమాలు అమలు చేస్తున్నామని కేసీఆర్ స్పష్టం చేశారు. తొలుత కొత్తగా నిర్మించిన నిజామాబాద్ జిల్లా సమీకృత కలెక్టరేట్‌కు రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు సోమవారం ప్రారంభోత్సవం చేశారు. జిల్లాల్లో సకల సదుపాయాలతో సమీకృత కలెక్టరేట్లను నిర్మించేందుకు నిర్ణయించిన విషయం విధితమే. ఇందులో భాగంగా నిజామాబాద్‌లో సుమారు 25 ఎకరాల విస్తీర్ణంలో ప్రభుత్వం సకల సదుపాయాలతో సమీకృత కలెక్టరేట్‌ను నిర్మించింది. ఇటీవల నిర్మాణం పూర్తయి అందుబాటులోకి రాగా.. సీఎం కేసీఆర్ కలెక్టరేట్‌ను ప్రారంభించారు. కార్యాలయంలో జరిగిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ సీ నారాయణరెడ్డిని సీటులో కూర్చుండబెట్టారు. పుష్పగుచ్ఛం అందించి.. శుభాకాంక్షలు తెలిపారు. అంతకు ముందు కలెక్టరేట్‌కు వచ్చిన సీఎం కేసీఆర్‌కు అధికారులు పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, సీఎస్ సోమేశ్‌కుమార్, సీఎంవో అధికారి స్మితా సబర్వాల్, నిజామాబాద్ ఉమ్మడి జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# ఒక్క క్యాచ్ మిస్..ఒక్క ఓవర్ లాస్

### మొత్తం మ్యాచ్ గెలుపును అడ్డుకున్న ఆ ఇద్దరు ● రసవత్తర పోరులో గెలవాలసిన మ్యాచ్‌లో ఓటమి ● భారత్,పాక్ ఆటతీరుపై సర్వత్రా విమర్శలు



**దుబాయ్,సెప్టెంబర్ 5 (సమ సమాజం):** భారత్,పాక్ మధ్యజరిగిన మ్యాచ్‌ను వీక్షించిన వారికి మన టీమ్ నిర్లక్ష్యం కారణంగా ఎంతగా మూల్యం చెల్లించుకున్నామో అర్థం అవుతుంది. ఒక్క క్యాచ్..అదీ సులువుగా చేతిలో పడ్డ బంతిని జారవిడవం వల్ల మ్యాన్‌నే కోల్పోయాం. గెలవాల్సిన మ్యాచ్‌లో నిర్లక్ష్యం, బాధ్యతా రాహిత్యం కారణంగా చేజేతులా విజయాన్ని చేజార్చుకున్నాం. ఆసియా కప్‌లో భాగంగా ఆదివారం రాత్రి దుబాయ్ వేదికగా జరిగిన ఇండో,పాక్ మ్యాచ్‌లో మనవాళ్ల నిర్లక్ష్యంపై ఇప్పుడు సర్వత్రా విమర్శలు వస్తున్నాయి.2 ఓవర్లలో పాక్ 26 పరుగులు చేయాల్సిన సమయంలో అనుభవజ్ఞుడైన భువనేశ్వర్ నిర్లక్ష్యంగా చేసిన బౌలింగ్ వల్ల ఒక్క ఓవర్‌లో 19 పరుగుల సమర్పించుకోవడంతో మ్యాచ్టర్న్ అయ్యింది. అలాగే అర్షదీప్ ఓ క్యాచ్ జారవడవడంతో అప్ప వరకు మ్యాచ్‌పై పట్టు నిలుపుకుంటూ వచ్చిన సమయంలో దెబ్బతిన్నాం. భువనేశ్వర్ నిర్లక్ష్యంగా బౌలింగ్ చేయడం, ఒకే ఓవర్లో 19 పరుగులివ్వడం, అంతకుముందు అర్షద్ క్యాచ్ జారవిడవడం వంటి రెండు ఘటనలు మనలను ఓటమిపాలు చేశాయి. ఇలా పాకిస్థాన్‌పై గెలవడానికి భారత్‌కు ఎన్ని మంచి అవకాశాలు వచ్చాయో వాటిని సద్వినియోగం చేసుకోవడంలో విఫలమయ్యారు. గ్రూప్ దశలో ఓటమికి.. కీలకమైన సూపర్-4 మ్యాచ్‌లో ఘనంగా ప్రతీకారం తీర్చుకుంది పాక్.ఆసియా కప్ గ్రూప్ దశలో పాకిస్థాన్‌పై పైచేయి సాధించిన టీమ్‌ఇండియా.. కీలకమైన సూపర్-4 దశలో ఆ జట్టుకు తలవంచింది. ఆదివారం హోరాహోరీ పోరులో భారత్ 5 వికెట్ల తేడాతో ఓడింది. మొదట భారత్ 7 వికెట్లకు 181 పరుగులు చేసింది. తరవాత ఛేదనలో వెనకబడ్డపాక్, మన ఫీల్డింగ్, బౌలింగ్ వైఫల్యాలతో సునాయసంగా గెలిచింది. 10 ఓవర్లకు 76/2తో ఉన్న పాక్.. 5 ఓవర్ల వ్యవధిలో 59 పరుగులు రాబట్టి 15 ఓవర్లకు 135/2తో పటిష్ట స్థితికి చేరుకుంది. చివరి 5 ఓవర్లలో పాక్ 47 పరుగులు చేయాల్సి వచ్చింది. ఈ స్థితిలో భారత బౌలర్లు పుంజుకున్నారు. నవాజ్, రిజ్వాన్‌లను వరుస ఓవర్లలో పెవిలియన్ చేర్చారు. భువి బౌలింగ్‌లో నవాజ్, హార్దిక్ బౌలింగ్‌లో రిజ్వాన్ భారీ షాట్లు ఆడబోయి పెవిలియన్ చేరారు. బిష్ణోయ్ (1/26) వేసిన తర్వాతి ఓవర్లో అసిఫ్ అలీ ఇచ్చిన తేలికైన క్యాచ్‌ను అర్ష్‌దీప్ అందుకుని ఉంటే కథ వేరుగా ఉండేది. అయినప్పటికీ 3 ఓవర్ల వ్యవధిలో 21 పరుగులే రావడంతో చివరి 2 ఓవర్లలో 26 పరుగులతో గెలుపు సమీకరణం కష్టంగానే కనిపించింది. కానీ 19వ ఓవర్లో భువి ఏకంగా 19 పరుగులిచ్చేయడంతో మ్యాచ్ పాక్ వైపు మొగ్గింది. చివరి ఓవర్లో ఆ జట్టు 7 పరుగులే చేయాల్సి వచ్చింది. అర్ష్‌దీప్ కట్టుదిట్టంగానే బంతులేసినప్పటికీ.. రెండో బంతికి అసిఫ్ అలీ (16) ఫోర్ బాదడంతో పాక్ పని తేలికైంది. 3 బంతుల్లో 2 పరుగులు చేయాల్సిన స్థితిలో అసిఫ్ ఎల్బీగా వెనుదిరిగాడు. కానీ తర్వాతి బంతికి ఇఫ్తికార్ 2 పరుగులు తీసి పాక్‌ను గెలిపించాడు. మొదట భారత ఇన్నింగ్స్ ఆసక్తికర మలుపులతో సాగింది. టాస్ ఓడి బ్యాటింగ్ చేసిన భారత్, ఇన్నింగ్స్‌ను ఆరంభించిన తీరు చూస్తే అలవోకగా 200 దాటేస్తుందనిపించింది. కానీ పవర్ ప్లేలో వీరవిహారం చేసిన అనంతరం ఓపెనర్లు వెనుదిరగ్గానే.. స్కోరు వేగం ఒక్కసారిగా పడిపోయింది. క్రమం తప్పకుండా వికెట్లు కూడా పడడంతో భారత్‌కు ఇబ్బందులు తప్పలేదు. మధ్య ఓవర్లలో పాక్ స్పిన్నర్లు గొప్పగా బౌలింగ్ చేసి భారత్‌కు కళ్లెం వేశారు. అయితే ఫామ్ అందుకున్న కోహ్లి క్రీజులో పాతుకుపోయి స్కోరు వేగం మరీ పడిపోకుండా చూశాడు. గ్రూప్ దశలో పాక్ పేసర్ల ధాటికి భారత ఓపెనర్లు తడబడ్డ తీరు చూసి ఈ మ్యాచ్‌లో వారేమాత్రం రాణిస్తారో అనుకుంటే.. ఇద్దరూ పోటీ పడి షాట్లు ఆడి జట్టుకు మెరుపు ఆరంభాన్నిచ్చారు. ముఖ్యంగా గత మ్యాచ్‌లో భారత్‌ను గట్టి దెబ్బ తీసిన నసీమ్ షాకు రోహిత్ తొలి ఓవర్లోనే ఫోర్, సిక్స్‌తో స్వాగతం పలికితే.. అతడి తర్వాతి ఓవర్లో రాహుల్ రెండు మెరుపు సిక్సర్లు బాదాడు. ఇన్నింగ్స్ చివరి ఓవర్లో తొలి మూడు బంతుల్లో కోహ్లి పరుగే తీయలేదు. చివరికతను నాలుగో బంతికి రనౌటై వెనుదిరిగాడు. 19వ ఓవర్ ఆరంభం నుంచి భారత్ 10 బంతుల్లో 9 పరుగులే రాబట్టింది. అయితే ఫీల్డింగ్ తప్పిదాలు కలిసొచ్చి చివరి 2 బంతులకు బిష్ణోయ్ ఫోర్లు రాబట్టడంతో భారత్ 180 దాటింది. 'ఎలాంటి పరిస్థితుల్లోనైనా, ఎలాంటి పిచ్‌పైనైనా 181 మంచి స్కోరు. మధ్యలో వికెట్లు తీయలేకపోతే ఎన్ని పరుగులు చేసినా కష్టమే. ఈ మ్యాచ్ మాకో పాఠం.' అని కెప్టెన్ రోహిత్ శర్మ వ్యాఖ్యానించాడు.

# ప్రజలకు పుస్తకాలను చేరువ చేయాలి

### ప్రతి గ్రామంలో లైబ్రరీలను అభివృద్ధి చేయాలి

### పాఠశాలల్లో గ్రంథాలయాను విస్తరించాలి

**హైదరాబాద్, సెప్టెంబర్ 5 (సమ సమాజం):** పుస్తకం హస్తభూషణం అన్నారు. ఇంటర్‌నెట్,స్మార్ట్ ఫోర్ మాయలో పడి మనం అంతా పుస్తక పఠనాన్ని మర్చి పోయాం. ప్రతిదీ గూగుల్ చూసిపెడుఉతందన్న భావనలో ఉన్నాం. కానీ పుస్తక పఠనంతోనే మస్తిష్కం వికసిస్తుంది. మనం మరచిపోతున్న ఈ అలవాటును జ్ఞప్తికి చేసుకునేలా పుస్తక ప్రదర్శనలు ఉపయోగపడుతున్నాయి. అక్కడక్కడా ఏర్పాటు చేస్తున్న బుక్‌ఫెయిర్‌లు మళ్లీ ఆనదదాన్ని నింపుతున్నాయి. ఆసక్తిని పంచుతున్నాయి. డిజిటల్ యుగంలోనూ పుస్తకాలకు ప్రాముఖ్యత ఇంకా కొనసాగుతుంది. అక్షరాభ్యాసంతో ఆరంభమయ్యే ఈ అభిరుచి నిరంతరం నిరాఘాటంగా కొనసాగించాలి.పుస్తకాలు ప్రియమైన నేస్తాలు. డిజిటల్ యుగం లోనూ పుస్తకాలకు ఉన్న ప్రాధాన్యత కొనసాగుతూనే ఉంటుంది. పుస్తకం ఒక విజ్ఞాన భాండాగారం. ఎప్పటికప్పుడు మన అవగాహనను పెంచుకోవడానికి అది అందించే విజ్ఞానం ఉపకరిస్తుంది. విజ్ఞానాన్ని పెంచుకోవడంతో బాటు, మనలో మనల్ని తెలుసుకునేలా చేస్తుంది. పుస్తకం మనచుట్టూ ప్రపంచాన్ని మనం తెలుసుకునేలా చేసే అపురూప సాధనంగా చూడాలి. అంతర్లీనంగా పుస్తకం అందించే విజ్ఞానం మన సామాజిక జీవనాన్ని నిర్దేశిస్తుంది. ఎన్నిపుస్తకాలు చదివితే అంతగా విజ్ఞానం అబ్బుతుంది. అందువల్ల పుస్తక ప్రియులు ఎలాగూ పఠనం చేస్తారు. ఆ అలవాటు లేనివారు సైతం అలవాటుచేసుకుంటే తమజ్ఞానాన్ని పెంచుకోగలుగుతారు. అందువల్ల పాటశాలస్థాయిలోనే రకరకాల పుస్తకాలను అందుబాటులో ఉంచాలి. పుస్తకాల పఠనంపై ఆసక్తి తగ్గడంతో ఊరూరా గ్రంథాలయాలు నెలకొల్పాలన్న లక్ష్యం నీరుగారిపోతోంది. అంతెందుకు స్కూళ్లలో కూడా గ్రంథాలయాలు అతంంతగానే ఉంటున్నారు. పాఠ్యపుస్తకాలు తప్ప ఇతర గ్రంథాలు అందుబాటులో ఉండడం లేదు. రెఫరెన్స్ పుస్తకాలు కూడా దొరకడం లేదు. డబ్బుండి కొనుక్కునే వారికి తప్ప పుస్తకాలు లేక లైబ్రరీలు నిరసించి పోతున్నాయి. అంతకుమించి నేటి విద్యార్థుల్లో పఠనాసక్తి తగ్గుతోంది. కేవలం పాఠ్య పుస్తకాలకే పరిమితం అవుతున్నారు. ప్రభుత్వ కళాశాలలు తగ్గడం, సామాజిక శాస్త్రాలు చదివిన వారికి తగిన ఉపాధి అవకాశాలు లేకపోవడం వల్ల ఆ శాస్త్రాలపై నేటి యువత మొగ్గుచూపటం లేదు. తద్వారా సమాజంతో బంధానికి దూరమౌతున్నారు. పాఠశాలల్లో ఒకప్పుడు లైబ్రేరియన్లు వుండేవారు. ఇప్పుడు ఆ పోస్టులు భర్తీ కావడం లేదు. ఫలితంగా విద్యాలయాల్లో విద్యార్థులకు పాఠశాలల్లో లభిస్తున్న పుస్తకాలపై అవగాహన కలగడం లేదు. ఇటువంటి పరిస్థితులలో సాహితీవేత్తలు, భాషాభిమానులు, స్వచ్ఛంద సంస్థలు గ్రంథాలయ ఉద్యమాలు వంటివి మరోసారి ప్రారంభించాల్సిన అవసరం వుంది.ఈ రోజుల్లో పుస్తక ప్రచురణ కష్టసాధ్యంగా మారింది. పాలకుల నుండి కూడా పెద్దగా ప్రోత్సాహం లభించడం లేదు. కేవలం పోటీ పరీక్షల కోసం ముద్రించే పుస్తకాలకు మాత్రమే డిమాండ్ ఉంటోంది. యువతలో ఎక్కువ మంది సినీ సాహిత్యానికే ప్రాధాన్యత ఇస్తున్నారు. 'యునెస్కో' అంచనా ప్రకారం ప్రతి ఐదు వేల మందికి ఒక గ్రంథాలయం ఉండాలి. మన దేశంలో కేవలం 75 వేల గ్రంథాలయాలున్నాయనేది ఒక అనధికార అంచనా. గ్రంథాలయాల్లో పోస్టుల భర్తీ కూడా సక్రమంగా జరగడం లేదు. చాలా గ్రంథాలయాలను ఆధునీకరించడం లేదు. లైబ్రరీలలో పాత పుస్తకాలే దర్శనమిస్తున్నాయి. గ్రంథాలయ వారోత్సవాలని కూడా మొక్కుబడిగానే నిర్వహిస్తున్నారు. ఆ రోజుల్లోనే అయ్యంకి రమణయ్య గ్రంథాలయాల అభివృద్ధికి పది ఎకరాల స్థలాన్ని దానం చేసి 'గ్రంథాలయ ఉద్యమ పిత' గా పేరు పొందారు. తెలుగు రాష్ట్రాల్లో పుస్తక మహోత్సవాలను హైద్రాబాద్, విజయవాడ, విశాఖపట్టణం, తిరుపతి, కర్నూలు వంటి ప్రముఖ పట్టణాలలో, జిల్లా కేంద్రాలలో మాత్రమే నిర్వహిస్తున్నారు. ఫలితంగా గ్రామీణ ప్రాంత విద్యార్థులకు మార్కెట్లో వచ్చే కొత్త పుస్తకాలపై అవగాహన ఏర్పడటం లేదు. పిల్లలకు కనీసం చదవడం, రాయడం వంటి విషయాలపై అవగాహన కల్పించాలని ఎస్.సి.ఇ.ఆర్.టి ఒక కార్యక్రమాన్ని చేపట్టింది. ఇటువంటి కార్యక్రమాలను దేశవ్యాప్తంగా నిర్వహించాలి. అసెంబ్లీ నియోజక వర్గాల్లో కూడా చిన్న, చిన్న పుస్తక మహోత్సవాలను నిర్వహించి స్థానిక రచయితలను గుర్తించి ప్రోత్సహించడం ద్వారా సాహిత్యాన్ని పరిపుష్టం చేయవచ్చు. గ్రామీణ ప్రాంతాలలో కూడా గ్రంథాలయాలను ఆధునీకరించాలి.

# కార్పొరేట్ శక్తులకు అండగా కేంద్ర నిర్ణయాలు



### ఎల్‌ఐసి ఉద్యోగుల ఆందోళనకు మద్దతు తెలిపిన మంత్రి

**నిర్మల్, సెప్టెంబర్ 5 (సమ సమాజం):** కార్మికుల హక్కులను కేంద్ర ప్రభుత్వం కాలరాస్తూ కార్పొరేట్ శక్తులకు అండగా నిలుస్తుందని అటవీ, పర్యావరణ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. ఎల్‌ఐసీలో వాటాల అమ్మకానికి కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న చర్యలను నిరసిస్తూ బీమా రంగంలో విదేశీ పెట్టుబడుల పరిమితిని పెంచాలన్న నిర్ణయానికి వ్యతిరేకంగా సోమవారం దిలావర్ పూర్‌లో ఎల్‌ఐసీ ఉద్యోగులు చేపట్టిన ఆందోళనకు మంత్రి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కేంద్ర ప్రభుత్వం అదానీ, అంబానీ లాంటి కార్పొరేట్ శక్తుల కోసం కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నది. నరేంద్రమోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్‌పరం చేస్తూ ప్రజలపై పన్నులభారం మోపుతున్నదని విమర్శించారు. రైల్వే, పోస్టల్, బ్యాంకింగ్, విమానయానం, బీఎస్ఎన్ఎల్, ఎల్‌ఐసీ వంటి అనేక ప్రభుత్వ సంస్థలను కార్పొరేట్ సంస్థలకు దారాదత్తం చేసే కుట్ర చేస్తున్నారన్నారు. ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న మోదీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని మంత్రి పిలుపునిచ్చారు. కార్మికులందరూ ఐక్యంగా పోరాడి కేంద్ర ప్రభుత్వ మెడలు వంచాలన్నారు. కేంద్ర మంత్రులు ప్రజా సంక్షేమాన్ని, అభివృద్ధిని గాలికి వదిలి తెలంగాణ గల్లీల్లో తిరుగుతూ బీజేపీ రాజకీయాలు చేస్తోందని మండిపడ్డారు. ఎల్‌ఐసిని కాపాడే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ముందు ఉంటుందని మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి వ్యాఖ్యానించారు. మరోవైపు మంత్రి గంగుల కమలాకర్ మాట్లాడారు. కార్పొరేట్ కంపెనీలకు బీజేపీ దోచిపెడుతోందని మంత్రి గంగుల కమలాకర్ ఆరోపించారు. ఎల్‌ఐసి ఉద్యోగులను కూడా రోడ్డు మీదకు తెచ్చి, ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మి ఆదానీ, అంబానీలకు ఇస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. జీఎస్టీ ఆదాయం అంతా కార్పొరేట్లకు పెడుతోందని ఆయన ఆరోపించారు.

# అప్పులు తెచ్చి మరీ పెన్షన్లు ఇస్తున్నాం

### పర్వతగిరిలో పెన్షన్ కార్డులు అందదించిన ఎర్రబెల్లి



**వరంగల్, సెప్టెంబర్ 5 (సమ సమాజం):** కరోనా సమయంలో అప్పు తెచ్చి మరీ పెన్షన్‌లు ఇచ్చిన మహానుభావుడు సీఎం కేసీఆర్ అని పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. సోమవారం పర్వతగిరి మండలం కేంద్రంలో కొత్త గా మంజూరు అయిన పెన్షన్ కార్డులను లబ్దిదారులకు పంపిణీ చేసి మాట్లాడారు. వారితో కలసి సహపంక్తి భోజనం కూడా చేశారు. పెండ్లిళ్ల చేసి పేద తల్లిదండ్రులు అప్పుల పాలు కాకూడదని పేదింటి ఆడబిడ్డలకు మేనమామ గా మారి కల్యాణ లక్ష్మి ద్వారా ఆర్థిక సహాయం చేస్తున్న ఏకైక సీఎం కేసీఆర్ అన్నారు. 24 గంటల కరెంట్, రైతుబంధు, రైతుబీమా ఇలా ప్రతి ఒక్కరి కోసం సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డాక రాష్ట్రంలోని ప్రతి ప్లలె బాగు పడింది. ఒక ప్రణాళికతో సీఎం కేసీఆర్ సబ్బండ వర్ణాల సంక్షేమం కోసం పని చేస్తున్నారు. మనమంతా సీఎం కేసీఆర్‌కు అండగా ఉండాలన్నారు. కార్యక్రమంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ తదితరులు ఉన్నారు.ఈ సందర్భంగా మంత్రి దయాకర్ రావు కొత్త పెన్షన్‌దారులతో కలిసి కాసేపు ముచ్చటించారు. అనంతరం వారితో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా మంత్రి ఎర్రబెల్లి సొంత గ్రామస్తులతో కాసేపు గడిపారు. గ్రామస్తులందరిని పేర్లు పెట్టి పిలుస్తూ, ఎలా ఉన్నారంటూ? వారి కుటుంబ యోగక్షేమాలు? బాగోగులు అడిగి తెలుసుకున్నారు. గ్రామస్తులతో తనకున్న అనుబంధాన్ని నెమరేసుకున్నారు. మంత్రి అందరితో కలిసిపోయి కాసేపు గడపడంతో పర్వతగిరి గ్రామస్తులు ఆనందంతో ఉప్పొంగిపోయారు. ఢిల్లీకి రాజు అయిన తల్లికి కొడుకే అన్నట్లుగా, 40 ఏండ్లుగా వివిధ హోదాల్లో ప్రజాప్రతినిధిగా ఉంటూ, మంత్రి అయ్యాక కూడా ఎర్రబెల్లి దయాకర్ రావు పెద్దగా మారలేదని, తమని మరచి పోలేదని ఆ గ్రామ ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు.




# చలన చిత్రం



## నాని..14 ఏళ్ల సినీ ప్రయాణం

### ఎన్నో జయాలు..అపజయాలు

అంతకంతకూ పరిణితి చెందుతూ సాగుతన్న వైనం

సరిగ్గా 14ఏళ్ల క్రితం అంటే సెప్టెంబర్ 5, 2008న అష్టాచమ్మా సినిమాతో టాలీవుడ్ సినీ ఇండస్ట్రీలోకి నేచురల్ స్టార్ నాని అడుగుపెట్టాడు. నాని ఫిల్మ్ ఇండస్ట్రీకి వచ్చి 14ఏళ్లు పూర్తయింది. ఈ సందర్భంగా ఆయన సోషల్ మీడియా వేదికగా ఓ ఫొటోను షేర్ చేశారు. తన 14ఏళ్ల సినీ కెరీర్ ను గుర్తు చేసుకుంటూ పోస్ట్ చేసిన ఈ పిక్ లో నాని పూర్తిగా ఎరుపు రంగు లైట్ లో ఉండడాన్ని చూడవచ్చు. ఇక నాని మొదటి సినిమా తీసినపుడు ఎవరికీ తెలియదు. ఎందుకంటే అది చిన్న సినిమా. కలర్స్ స్వాతి తప్ప ఆ సినిమాలో ఇంకెవరున్నారో కూడా ఎవరికీ సరిగా తెలియదు. కానీ విడుదల తర్వాత ఎవరూ ఎరుగని రీతిలో విజయాన్ని సాధించి... తెలుగు ప్రేక్షకులు దగ్గరవడం ప్రారంభించాడు. అసిస్టెంట్ డైరెక్టర్‌గా ఉన్న నానిలో నటున్ని చూసిన డైరక్టర్ ఇంద్రగంటి మోహనకృష్ణ.. తన సినిమాలో హీరోగా అవకాశం ఇవ్వడంతోనే ఈ రోజు నేచురల్ స్టార్ గా నాని మన ముందుకు వచ్చాడు. తర్వాత చెప్పుకోవడానికి పెద్ద మార్కెటేమీ లేకపోయినా అడపా దడపా సినిమాలు చేసుకుంటూ నాని కెరీర్ లో బిజీ అయ్యాడు. రైడ్, భీమిలి కబడ్డీ జట్టు లాంటి సినిమాలు అంతగా ఆడపోయినా మంచి విజయమే సాధించాయి. 2011 హీరోగా నాని కెరీర్ నే మార్చేసింది. అలా మొదలైంది, పిల్ల జమిందార్ లాంటి విజయాలతో నానికి మంచి క్రేజ్ వచ్చింది. ఇక 2012లో వచ్చిన 'ఈగ' సినిమాతో నాని నేషనల్ వైడ్ ఫేమస్ అయిపోయాడు. అయితే అదే ఏడాది నానికి బ్యాడ్‌టైమ్ కూడా మొదలైంది. 2012 నుంచి 2015 మధ్యలో వచ్చిన 'ఎటో వెళ్లిపోయింది మనసు', 'పైసా', 'ఆహా కళ్యాణం', 'జెండా పై కపిరాజు'.. ఇలా వరస సినిమాలయితే చేశాడు.. కానీ హిట్లు మాత్రం అందుకోలేదు. ఆ సమయంలోనే వచ్చిన సినిమా 'ఎవడే సుబ్రమణ్యం'. 2015 మార్చి 21న ఈ చిత్రం విడుదలైంది. ఆ తర్వాత 'భలేభలే మగాడివోయ్'తో నాని కాస్తా నేచురల్ స్టార్ అయ్యాడు. ఈ 14 ఏళ్ళ ప్రయాణంలో 'ఎటో వెళ్లిపోయింది మనసు'కు నంది.. 'భలేభలే మగాడివోయ్' సినిమాకు ఫిల్మ్‌ఫేర్ అవార్డును నాని సొంతం చేసుకున్నాడు. అలా మళ్లీ జోరందుకున్న నాని సినిమాలు.. 'కృష్ణగాడి వీర ప్రేమగాధ','జెంటిల్ మన్', 'మజ్ను', 'నేను లోకల్', 'నిన్ను కోరి', 'ఎంసీఏ' సినిమాలతో వరసగా 8 విజయాలు అందుకున్నాడు. 2019లోవచ్చిన జెర్సీ సినిమా ఎంత సక్సెస్ ను నమోదు చేసిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఈ సినిమాతో తన టాలెంట్ ను మరోసారి నిరూపించుకున్నాడు. దాని తర్వాత గ్యాంగ్ లీడర్, వీ, టక్ జగ్ దీశ్ సినిమాలతో అలరించాడు. ఆ తర్వాత శ్యామ్ సింగరాయ్ సినిమాతో నాని తనలోని మరో హీరో కోణాన్ని ప్రేక్షకులకు చూపించి అందనంత ఎత్తుకు ఎదిగాడు. ఈ మధ్యే అంటే సుందరానికితో మంచి హిట్ కొట్టిన నాని... ప్రస్తుతం దసరా సినిమాతో బిజీగా ఉన్నాడు. ఈ మూవీ నాని కెరీర్లోనే పెద్ద బడ్జెట్ సినిమాగా ఈ మూవీ తెరకెక్కనుంది. ఈ చిత్రంలో కీర్తి సురేష్ హీరోయిన్ గా నటిస్తుండగా ఈ మూవీ మార్చి 30, 2023న విడుదల కానున్నట్టు మూవీ మేకర్స్ ప్రకటించారు.

## సీరియస్ పాత్రలకు నాంది పలికిన నరేశ్



చాలా కాలం తర్వాత 'నాంది' చిత్రంతో మంచి కంబ్యాక్ ఇచ్చాడు అల్లరి నరేష్. కామెడీ సినిమాలకు కేరాఫ్ అడ్రస్‌గా ఉండే అల్లరి నరేష్..నాందీతో పూర్తి స్థాయి సీరియస్ పాత్రలో నటించి విమర్శకులు నుండి గొప్ప ప్రశంసలు అందుకున్నాడు. ఈ చిత్రంలో నరేష్ తన విలక్షమైన నటనతో ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకున్నాడు. గతేడాది ఫిబ్రవరిలో విడుదలైన ఈ చిత్రం కమర్షియల్‌గా కూడా మంచి విజయం సాధించి అల్లరి నరేష్ మార్కెట్‌ను పెంచింది. విజయ్ కనకమేడల దర్శకత్వ ప్రతిభకు గొప్ప ప్రశంసలు దక్కాయి. ఈ కాంబోలో రెండవ సినిమా తెరకెక్కనున్నట్లు గతంలోనే ప్రకటన రాగా.. ఇటీవలే టైటిల్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఆ టైటిల్ పోస్టర్‌కు ప్రేక్షకుల నుండి విశేష స్పందన వచ్చింది. ఈ చిత్రానికి ఉగ్రం అనే టైటిల్‌ను ఖరారు చేశారు. క్రైమ్ థ్రిల్లర్ నేపథ్యంలో తెరకెక్కనున్నఈ చిత్రాన్ని ÷న్ స్క్రీన్ పతాకంపై సాహు గారపాటి, హరీష్ పెద్ది నిర్మిస్తున్నారు. తాజాగా ఈ చిత్రం హైదరాబాద్‌లో షూటింగ్ ప్రారంభించింది. ఈ షెడ్యూల్‌లో మేకర్స్ కీలక సన్నివేశాలను తెరకెక్కించనున్నారట. ఈ చిత్రం కూడా పూర్తి స్థాయి సీరియస్ థ్రిల్లర్‌గా తెరకెక్కనున్నట్లు తెలుస్తుంది. ప్రస్తుతం నరేష్ నటించిన 'ఇట్లు మారేడుమిల్లి నియోజకవర్గం' విడుదలకు సిద్ధంగా ఉంది.

## పవన్ మామతో సినిమా కోసం సాయిధరమ్ ఎదురుచూపు



పవన్ పుట్టినరోజును పురస్కరించుకొని 'హరిహర వీరమల్లు' టీజర్‌తో అభిమానులకు కాస్తంత ఊరట కలిగించారు. అయితే ఈ సినిమా విడుదల తేదీని మాత్రం ఖాయం చేయలేకపోయారు. కాకపోతే చిత్రం ఆగిపోయిందన్న పుకార్లకు మాత్రం చెక్ పెట్టగలిగారు. ఈ సినిమా పరిస్థితే ఇలా ఉంటే.. హరీశ్ శంకర్ 'భవదీయుడు భగత్‌సింగ్' చిత్రం గురించి ఇక చెప్పనే అక్కర్లేదు. ఫ్యాన్స్‌కు తన ట్వీట్లతో ఎలివేషన్స్ మాత్రం ఇస్తున్నాడు. సినిమా ఎప్పుడు పట్టాలెక్కుతుందో అతడికే క్లారిటీ లేదు. ఈ నేపథ్యంలో పవర్ స్టార్ తమిళ రీమేక్ చిత్రం 'వినోదయ చిత్తం' ట్రాక్ ఎక్కడానికి ఇంకా చాలా టైమ్ పడుతుందని సమాచారం అందుతోంది. సినిమా కోసం పవర్ స్టార్ నుంచి తక్కువ కాల్షీట్స్ తీసుకొని.. కేవలం 20 రోజుల్లో ఆయన కాంబినేషన్ సీన్స్‌ను షూట్ చేయాలని ప్లాన్ చేసుకున్నారు మేకర్స్. దీని కోసం చాలానే హోం వర్క్ జరిగింది. ఇందులో మరో ముఖ్యపాత్ర చేస్తున్న సాయిధరమ్ తేజ్ వేరే సినిమాలకు కమిట్‌మెంట్స్ ఇవ్వలేదు. చినమావయ్యతో నటించే అరుదైన అవకాశాన్ని వదులుకోడానికి అతడు రెడీగా లేదు. అయితే పవన్ మాత్రం ఏదీ తేల్చుకోలేకపోతున్నట్టు వినికిడి. త్రివిక్రమ్ ఫైనల్ వెర్షన్ రెడీ చేయించినా ఎలాంటి నిర్ణయం తీసుకోలేకపోతున్నారట. ఒరిజినల్ వెర్షన్ తెరకెక్కించిన సముద్రఖని నే ఈ సినిమాను తెరకెక్కించబోతున్నాడు. అయితే ఆయన ప్రస్తుతం వరుస చిత్రాలతో ఫుల్ బిజీగా ఉన్నారు. సముద్రఖని ఆర్టిస్ట్ గా మూడు భాషల్లో వరుసగా నటిస్తున్నారు. ఎప్పుడు పడితే అప్పుడు పవన్ తో సినిమా తీయమంటే.. ఒప్పుకొనే రకం కాదు. కనీసం నెల ముందుగా ప్లాన్ చేసుకుంటేనే తప్ప.. చిత్రం పట్టాలెక్కే అవకాశం లేదు. నిజానికి ఓటీటీలో ఎప్పుడు రిలీజ్ అయిందో ఎవరికీ తెలియని 'వినోదయ చిత్తం' చిత్రం గురించి పవన్ అభిమానులకు అంతగా ఆసక్తి లేదు. అలాగే.. సాయిధరమ్ తేజ్ కూడా నటిస్తున్నాడనే ఆత్రం అంతకన్నా లేదు. వాళ్ళ దృష్టిమొత్తం 'హరిహర వీరమల్లు' పైనే ఉంది. ముందుగా ఈ సినిమాను కంప్లీట్ చేయడంపై దృష్టిపెట్టండని పవన్‌ను అభ్యర్ధిస్తున్నారు.

## రెండో పెళ్లిపై రేణూ సందిగ్ధం




నటి, దర్శకురాలు రేణు దేశాయ్ గురించి ప్రత్యేకంగా పరిచయం చేయాల్సిన పనిలేదు. బద్రి సినిమాతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైన ఆమె ఇండస్ట్రీలో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంది. 2012లో పవన్ కల్యాణ్‌తో విడాకులు తీసుకున్న రేణు దేశాయ్ అప్పటి నుంచి సింగిల్‌గా ఉంటుంది. అయితే గతంలో రేణు దేశాయ్ రెండో పెళ్లిపై వార్తలు చక్కర్లు కొట్టిన సంగతి తెలిసిందే. జీవితంలో ఒక తోడు అవసరం అని స్వయంగా రేణు దేశాయ్ కొన్ని ఇంటర్వ్యూలో పేర్కొంది. ఈ క్రమంలోనే రెండో పెళ్లికి సిద్ధమైన రేణు దేశాయ్‌కి 2018లో ఓ వ్యక్తితో నిశ్చితార్థం కూడా జరిగింది. కానీ ఆ తర్వాత అతనితో పెళ్లిపై ఇంతవరకు క్లారిటీ లేదు. అయితే తాజాగా రేణు దేశాయ్ చేసిన పోస్ట్‌తో ఆమె రెండోపెళ్లిపై మరోసారి చర్చకు దారితీసింది. 'జీవితంలో అవసరం ఉన్నప్పుడు మనచేయి పట్టుకుని నడిపించే ఒక తోడు కావాలి'.. అంటూ ఇన్‌స్టాలో ఓ పోస్టును షేర్‌చేసింది. అనంతరం మరో పోస్ట్‌లో.. 'మీ సోల్‌మేట్‌ని వెతకడానికి ముందు మిమ్మల్ని మీరు పూర్తిగా అర్థం చేసుకోండి'.. అంటూ ఓ వీడియోను షేర్ చేసింది. ప్రస్తుతం రేణు దేశాయ్ చేసిన ఈ పోస్ట్ నెట్టింట వైరల్‌గా మారింది.

Edited, Printed, Published & owned by **GOSUKONDA PRUDHVIRAJU**, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA,
Printed at **Panidhar PUBLICATIONS**. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: **GOSUKONDA PRUDHVIRAJU**,
RNI.TELTEL/2016/ 73311, Cell:8897334003 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in